

ఉష్ణోగ్రత (అంచనా)

18-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	27
తెనాలి	36	28
నరసరావుపేట	36	26
బాపట్ల	35	28
రెంటచింతల	37	28
చీరాల	35	28



- నియోజకవర్గాల విజన్-2047కు కసరత్తు
- ఎమ్మెల్యే చైర్మన్‌గా కొలువు దీరనున్న బృందం
- సభ్యులుగా ఐదుగురు సచివాలయ ఉద్యోగులు
- విభాగాల వారీగా ప్రతి నెలా ప్రభుత్వానికి నివేదికలు

అభివృద్ధి దిశగా.. అడుగులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వస్తోంది. క్షేత్రస్థాయిలో సమస్యలు.. శాఖల వారీగా కార్యక్రమాల తీరుతెన్నులు.. ప్రజల సంతృప్తి.. తదితరాల ఆధారంగా నియోజకవర్గాల వారీగా ప్రణాళికలపై ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. స్వర్ణాంధ్ర-2047 సాకారం కావాలంటే ముందుగా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వం తలంచింది. ఇందులో భాగంగానే నియోజకవర్గాల వారీగా కసరత్తుకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలపై ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టనుంది. దీనికి సమాంతరంగా అక్కడ ఉన్న వనరులు.. ఏ రంగంలో ఉపాధి కల్పనకు అవకాశం ఉంది.. ఇందుకోసం ప్రభుత్వం నుంచి అందాల్సిన సహకారం .. తదితర అంశాల ప్రాతిపదికగా కసరత్తు చేయనున్నారు. విజన్-2047లో భాగంగా నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే పాత్రను కీలకం చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఎమ్మెల్యే చైర్మన్‌గా, నియోజకవర్గ కేంద్ర ఎంపీడీవో కన్వీనర్‌గా, ఐదుగురు సచివాలయ ఉద్యోగులు సభ్యులుగా ప్రత్యేక బృందం పనిచేయనున్నది. ఇందుకోసం ఐదుగురు సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియోజకవర్గ కేంద్రంలో నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టనుంది. సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను సైతం మూడు జిల్లాల పరిధిలో అధికారులు పూర్తి చేశారు. ఇక నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేకంగా ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆయా విభాగాలు తయారు చేసే సవివర ప్రణాళికలను ముందుగా ఎమ్మెల్యేతో వాటి సాధ్యాసాధ్యాలపై చర్చించి నివేదికలను ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. పేదరిక నిర్మూలనతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పన, చివరి ఆయకట్టు వరకు సాగునీరు, గిట్టుబాటు ధరలే తొలి ప్రాథమ్యాలుగా ఉండనున్నాయి. ప్రతినెలా ఆయా కార్యక్రమాల అమలు నివేదికలను ప్రభుత్వానికి పారదర్శకంగా అందించాల్సిన బాధ్యతను సదరు బృందంపైనే ఉంది. నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ప్రత్యేక అధికారుల నియామకం జరిగింది. వీరు కూడా బృందంతో కలిసి అడుగు లేయనున్నారు. ఇప్పటికే ప్రతి నెలా మూడో శనివారం ఓ థీమ్‌ను ఎంపిక చేసుకుని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్ర మం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దానిని మొక్కుబడి తంతుగా మార్చేయకుండా దాని ద్వారా వచ్చిన ఫలి తాలపై కూడా ప్రతి మూడు నెలలకొకసారి నియోజకవర్గ బృందాలతో సమీక్షించి సూచనలు చేసే దిశగా కూడా ప్రభుత్వం అడుగులేస్తోంది.

దాదాపు 110 మంది సచివాలయ ఉద్యోగులు..

ఇందుకోసం బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు 110 మంది సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియమించనున్నారు. అయితే ప్రభుత్వం సచివాలయాల రేషనలైజేషన్‌కు శ్రీకారం చుట్టినందున ఆయా నియోజకవర్గాల్లో వారి నియామకాల ప్రక్రియకు కొంత ఆటంకం కలుగుతున్నట్లు అధికారుల చెప్తున్నారు. గుంటూరు జిల్లాలో రెండు, బాపట్లలో మూడు, పల్నాడు జిల్లాలో మూడు నియోజకవర్గాలకు ఇంకా ఉద్యోగుల నియామకం జరగలేదంటున్నారు. ఈ నియామక గడువు ఏడాది ఉంటుందని, ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు శిక్షణ ముగించామని అధికారులు చెబుతున్నారు.

మట్టి పరీక్షలు.. మొక్కుబడిగా..



సరికొండ పాలెంలో మట్టి నమూనా సేకరణ

నానాటికీ నిస్సారంగా మారుతున్న నేల తల్లిని రక్షించి రైతులకు లబ్ధి చేకూరేలా భూసార పరీక్షలను చేపట్టాలి. ఇందుకు సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి జిల్లాల వారీగా లక్ష్యాలు నిర్దేశించింది. సాగుకు రైతులు సన్నద్ధమయ్యే నాటికి భూసార పరీక్షలు పూర్తి చేసి భూ ఆరోగ్య కార్డులు అందజేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో లక్ష్యంలో అర శాతం కూడా చేయ లేదు. మొక్కుబడిగా మట్టి నమూ నాలు సేకరించారే కానీ పరీక్షల విషయంలో పూర్తిగా అలసత్వం వహిస్తున్నారని వ్యవసాయశాఖ లెక్కలు సూచిస్తున్నాయి. సాగుకు సమయం ఆసన్న మవుతున్న తరుణంలో భూసార పరీక్షల కార్డుల కోసం రైతులు ఎదురు చూస్తున్నా వ్యవసాయ శాఖలో చలనం లేదు. మట్టి పరీక్షలకు ఈ నెల 15న గడువు కాగా ఇప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. మూడు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. అయితే ఇప్పటకి కేవలం 391 పరీక్షలు మాత్రమే పూర్తయినట్లు వ్యవసాయశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

- పుడమి ఆరోగ్య పరీక్షల్లో అలసత్వం
- మూడు జిల్లాల్లో 60,124 పరీక్షల లక్ష్యం
- ఇప్పటికి 391 నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తి
- గడువు దాటినా వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూసార పరీక్షలను యజ్ఞంలా చేయాలని ప్రభుత్వం సంకల్పించగా ఆచరణలో అది అమలు కావడంలేదు. మట్టి నమూనాలను సేకరిస్తున్నారే తప్ప పరీక్షలు నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ నెల 15 కల్లా భూసార పరీక్షలు పూర్తి చేసి రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. అయితే గడువు దాటినా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పరీక్షలు జరుగుతున్న తీరు పరిశీలిస్తే పంటల సాగు ప్రారంభం నాటికి పూర్తయ్యే పరిస్థితులు కూడా కానరావడం లేదు. పరీక్షలే సక్రమంగా జరపలేదంటే ఇక రైతులకు ఏమాత్రం భూసార పరీక్షల కార్డులు అందాయో తెలుసుకోవచ్చు. పంటల సాగులో భూసార పరీక్షలు కీలకం. భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. నేలలో పోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. అదే విధంగా ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో రైతులకు తెలియజేస్తారు. నేల ఆరోగ్య పరీక్షలు ఆధారం గానే పంట సాగు చేయాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఇంతటి ప్రాధాన్య పరీక్షలపై రైతులు ఆసక్తి చూపుతున్నా వ్యవసా యశాఖలో నిర్లక్ష్యం కనిపిస్తోంది.



ఉప్పలపాడులో మట్టి నమూనాల సేకరణ

ఇలా సాగితే ఏడాదైనా కష్టమే..

పల్నాడు జిల్లాలో 23,437 మట్టి నమూనాల పరీక్షల చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. 18,158 మట్టి నమూనాలను సేకరించి 388 మట్టి నమూనాలను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డులను సిద్ధం చేశారు. అంటే 2.10 శాతం మాత్రమే మట్టి నమూనాల పరీక్షలు మాత్రమే పూర్తయ్యాయి. బాపట్ల జిల్లాలో 22,825 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 14,287 నమూనాలను సేకరించి రెండింటికి పరీక్షలు పూర్తి చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. గుంటూరు జిల్లాలో 13,882 మట్టి నమూనాలను పరీక్షించాలని లక్ష్యం కాగా ఇప్పటికి 9,784 నమూనాలను సేకరించి ఒక్క నమూనా పరీక్ష మాత్రమే చేశారు. ఇలా మూడు జిల్లాల పరిధిలో సేకరించిన నమునాల పరీక్షలకు ఇంకెన్ని రోజుల సమయం తీసుకుంటారో వ్యవసాయ శాఖ అధికారులకే తెలియాలి. పరీక్షలు ఇలా కొనసాగితే ఏడాదికి కూడా పూర్తి చేయడం అసాధ్యమని రైతులు చెప్తున్నారు. కనీసం పరీక్షలను వేగవంతం చేసి జూన్ కన్నా భూఆరోగ్య కార్డులు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

భూసార కార్డులు ఉంటేనే సూక్ష్మపోషకాలు

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. రాయితీపై సూక్ష్మపోషకాల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ఆయా సూక్షపోషకాల పంపిణీకి భూసార కార్డులను తప్పనిసరి చేసింది. ఆయా కార్డుల్లో సూచించిన మేర సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించనున్నా.. ఆ కార్డులు పంపిణీ ఇంతవరకు జరగలేదు. ఈ పరిస్థితుల్లో రైతులకు సకాలంలో సూక్షపోషకాలు ఏమేరకు అందుతాయో తెలియాల్సి ఉంది.

జిల్లా	పరీక్షల లక్ష్యం	నమూనాల సేకరణ
పల్నాడు	23,437	18,158
బాపట్ల	22,825	14,287
గుంటూరు	13,862	9,784



దేవాలయం ప్రాకారం లోపల ఏర్పాటు చేసిన క్యూలైనులు

శింగరకొండలో మహా ఏర్పాట్లు

- రేపటి కుంభాబిషేకానికి సర్వం సిద్ధం

అద్దంకి, మే 17 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతిమండపం పునర్నిర్మాణం సందర్భంగా సోమవారం నిర్వహించే మహాకుంభాభిషేకం, జీవధ్వజస్తంభం పునఃప్రతిష్ఠకు సర్వం సిద్ధమవుతోంది. సుమారు 10 వేల మంది భక్తులు వేచి ఉండే విధంగా ఆలయ ప్రాకారం లోపల, బయట క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. క్యూలోకి భక్తులు ప్రవేశించే సమయంలోనే వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. మహాకుంభాభిషేకానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఎండ లేకుండా ఉండేలా దేవాలయం నుంచి యాదవుల అన్నదానసత్రం వరకు రోడ్డుపై టెంట్లు ఏర్పాటు చేశారు. తిరుణాళ్ల సమయంలో రంగుల రాట్నాలు ఉంచే ప్రాంతంలో దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానానికి ఏర్పాట్లు చేశారు. అన్ని సత్రాల్లో కూడా అన్నదానాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వేమూరులో.. సిందూర్ విజయోత్సవం

- తిరంగా ర్యాలీకి తరలివచ్చిన ప్రజలు, ప్రముఖులు
- దేశం ఉగ్రవాదాన్ని సహించదు : మంత్రి పార్థసారథి
- ప్రధాని మోదీ ఆలోచనా శక్తి గొప్పది : ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ శనివారం వేమూరులో జరిగింది. ప్రజలు, ప్రముఖులు పెద్దసంఖ్యలో తరలిరాగా జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వేమూరులోని వేణు కేశవస్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన ర్యాలీలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు, కొణిజేటి రోశయ్యలకు నివాళులర్పించారు. జనవాహినితో నినాదాలు చేసుకుంటూ ర్యాలీ ఎన్టీఆర్ పురవేదిక వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశం ఉగ్రవాదాన్ని సహించదని ఆపరేషన్ సిందూర్‌తో నిరూపించామన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారతదేశాన్ని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. పాకిస్తాన్ ఉగ్ర ఆలోచనలకు సిందూర్ ద్వారా త్రివిధ దళాలు బుద్ధి చెప్పాయన్నారు. దేశ జవాన్లు చూపిన ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ గర్వించాలన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి దేశ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించిన పాకిస్తాన్‌కు ఆపరేషన్ సిందూర్ ద్వారా బుద్ధి చెప్పేందుకు ప్రధానమంత్రి మోదీ గొప్ప ఆలోచన చేశారని ప్రశంసించారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ పాకిస్తాన్‌కు సిందూర్ ద్వారా బలమైన జవాబు చెప్పారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, టీడీపీ పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, సర్పంచ్ లక్ష్మీతిరుపతమ్మ, నాయకులు మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదనప్రసాద్, రాజశేఖర్‌బాబు, సాయిబాబా, బీజేపీ నాయకుడు మందా జనార్ధన్ పాల్గొన్నారు.



వేమూరులో తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో తదితరులు



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వీధులు శుభ్రపరుస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్, ఆర్డీవో తదితరులు



జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణాన్ని సిబ్బందితో కలిసి శుభ్రం చేస్తున్న ఎస్పీ తుషార్ డూడి, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ తదితరులు

ఆరోగ్యకర వాతావరణమే లక్ష్యం

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఏఎస్పీ విఠలేశ్వర్, సిబ్బందితో కలిసి కార్యాలయ పరిసరాలను ఎస్పీ శుభ్రం చేశారు. చెత్త, వ్యర్థాలను తొలగించి మొక్కలకు నీరుపోశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛత అంటే కేవలం శుభ్రత మాత్రమే కాదని అది మన అభివృద్ధికి పునాది వంటిదని చెప్పారు. శుభ్రమైన పరిసరాలు మన ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు. వేసవిలో సహజమైన చల్లదనం కోసం టెర్రస్‌లపై ఆరోగ్యకరమైన మొక్కలను ఏర్పాటు చేయాలన్నారు. పక్షుల దాహాన్ని తీర్చేందుకు టెర్రస్‌లపై మట్టిపాత్రల్లో నీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. భూమిపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, వర్షాలు పడేందుకు చెట్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. మనం నాటిన మొక్కలు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం సామాజిక బాధ్యతగా భావించి అందరు సమష్టగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఆర్ఐ మౌలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి.. ఈఏపీ సెట్

- మూడు జిల్లాలో 22 కేంద్రాలు
- 19, 20 తేదీల్లో అగ్రికల్చరల్, ఫార్మసీ
- 21 నుంచి 27 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు

గుంటూరు(విద్య) మే 17 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ అగ్రికల్చరల్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వ హించే ఏపీఈఏపీ సెట్(ఆన్‌లైన్) పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆయా పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో బాపట్లలో రెండు, పల్నాడు జిల్లాలో ఐదు, గుంటూరు జిల్లాలో 15 కేంద్రాలు ఉన్నాయి. అగ్రికల్చరల్ ఫార్మసీ విభాగం విద్యార్థులకు 19, 22 తేదీల్లో, ఇంజనీరింగ్ విద్యార్థులకు 21 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు ఉం టాయి. ఆన్‌లైన్ కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా పరీక్షలకు మొత్తం 41,319 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో ఇంజనీరింగ్ పరీక్షకు 34,148 మంది అగ్రికల్చరల్, ఫార్మసీ పరీ క్షకు 7106 మంది హాజరు కానున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని కోఆర్డినేటర్లు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అను మతించమని స్పష్టం చేశారు.

నాడు హామీ.. నేడు నిధులు

- సీఎం చొరవతో రూ.1.48 కోట్లు మంజూరు
- నిధులు మంజూరుతో మున్సిపల్ హైస్కూల్‌కు మహర్దశ
- వేగవంతంగా పనులు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు

బాపట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టగా.. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లోని భవనసముదాయాన్ని పూర్తి చేయకుండా పనులను నిలిపేశారు. తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం నిర్మాణ పనులపై ప్రత్యేకంగా చొరవ తీసుకోవడంతో హైస్కూల్‌కు మహర్దశ పట్టింది. వైసీపీ పాలనలో అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారు. గత ఏడాది డిసెంబరు 7న బాపట్లలో జరిగిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశానికి వచ్చిన ముఖ్యమంత్రి ఈ భవనాన్ని పరిశీలించారు. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న సీఎం పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ప్రకారం స్పెషల్ గ్రాంట్ కోటి 48లక్షల రూపాయలు మంజూరు చేశారు. దీంతో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో వచ్చే విద్యాసంవత్సరం నాటికి నిర్మాణం పూర్తి చేసేలా అధికారులు పనులను వేగవంతం చేశారు. భవనం పూర్తయితే 30 తరగతి గదులు అందుబాటులోకి వస్తాయి.

చెట్ల కింద చదువులతో సరి..

గత ఐదేళ్ల వైసీపీ హయాంలో హైస్కూల్ పనుల గురించి పట్టించుకోలేదు. దీంతో విద్యార్థులకు చెట్ల కింద చదువులు తప్పలేదు. నాడు-నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పిన వైసీపీ పాలకులు ఈ భవనం పనుల ఊసెత్తలేదు. దీంతో గత ఐదేళ్లుగా పాఠశాలలో 919 మందికిపైగా విద్యార్థులు చాలీచాలని గదులతో ఇబ్బంది పడ్డారు. 2018-2019లో అప్పటి ఎంపీ శ్రీరామ్‌మాల్యాద్రి కృషితో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.2 కోట్లతో యూ అకారంలో రెండంతస్థుల భవన సముదాయాన్ని నిర్మించేలా పనులు చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పేరిట పాఠశాల అభివృద్ధికి రూ.78.57 లక్షలు మంజూరు చేసినా ఈ భవన సముదాయం పనులు పూర్తిచేయలేదు. పాతభవనం మరమ్మతులు, ఇతరపనులకు రూ.53.17 లక్షలు ఖర్చు చేశారు. రెండో విడత నాడు-నేడులో రూ.71.66 లక్షలు మంజూరు కాగా రూ.44.32 లక్షలు ఖర్చు చేసి గ్రౌండ్ ఫ్లోర్‌ను వినియోగంలోకి తేచ్చారు. దీంతో మిగిలిన రెండు ఫ్లోర్లు మొండిగోడలకే పరిమితమయ్యాయి. గతంలో 1300మందికిపైగా విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 919 మందికి పరిమితమైంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలో అత్యధికంగా విద్యార్థులు ఉన్న పాఠశాలలో నెలకొన్న సమస్యపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా స్పందించి నిధులు మంజూరు చేయడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే గోడలు పగలకొట్టి కిటికీలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన పనులు చేస్తున్నారు.



తరగతి గదుల్లో కిటికీల ఏర్పాటుకు పగలకొట్టిన గోడలు

సరస్వతి పుష్కరాలకు 24న ఆర్టీసీ స్పెషల్ బస్సు

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు, భక్తుల విజ్ఞప్తి మేరకు గుంటూరు నుండి సరస్వతి నదీ పుష్కరాలకు స్పెషల్ బస్సు ఈ నెల 24న ఏర్పాటు చేసినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ హైటెక్ బస్సు పుష్ బ్యాక్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తొలి రోజు బస్సు గుంటూరులో రాత్రి 10 గంటలకు బయలు దేరి.. రెండో రోజు ఉదయానికి కాళేశ్వరం చేరుతుందని తెలిపారు. అక్కడ పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం సాయంత్రం 4 గంటలకు బయలుదేరి.. రామప్ప దేవాలయ దర్శనం, అనంతరం వరంగల్‌లో భద్రకాళి మాత గుడి, వెయ్యి స్తంభాల గుడిని దర్శించి, మూడో రోజు ఉదయాన్నే కొండగట్టు చేరుతుందని తెలిపారు. అక్కడి నుంచి వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న తర్వాత రాత్రి గుంటూరు చేరుతుందన్నారు. ఇతర వివరాలకు 73828 97459, 73828 96403 సంప్రదించాలని కోరారు.

త్రికోటేశ్వరుని సన్నిధిలో జీవీ దంపతులు


ప్రత్యేక పూజలు చేస్తున్న జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండ, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్ర మైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంప తులు శనివారం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి మూలవి రాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రజల శ్రేయస్సు కోరుతూ ప్రత్యేక ప్రార్థన లు చేశారు. ఆలయ అధికారులు వారికి స్వామివారి తీర్థప్రసా దాలు అందజేశా రు. జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం


జడ్పీ కార్యాలయంలో శుభ్రం చేస్తున్న సీఈవో జ్యోతి బసు

గుంటూరు సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంతో పాటు ఆనంద ఉంటుందని జడ్పీ సీఈఓ జ్యోతిబసు పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలను ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుకుంటారో.. కార్యాల యాలను కూడా అదేవిధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యాలయ ఆవరణలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అకౌంట్స్ ఆఫీసర్ పి.శామ్యూల్ పాల్, సూపరింటెండెంట్లు మల్లేశ్వరరావు, పూర్ణ చంద్రా రెడ్డి, తోట ఉషాదేవి పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పార్టీ జనసేన


సభ్యత్వ కిట్లు పంపిణీ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కొర్రపాటి నాగేశ్వరరావు

గుంటూరు సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పార్టీ జనసేన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని లాల్ పురంలో జరిగిన జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కార్యకర్తల త్యాగాలు వల్లే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రత్తిపాడు పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లు ఎదురైనప్పటికీ ముందుకు నడచిన జన సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. నగర ఉపాధ్యక్షుడు చింత రేణుకరాజు, జిల్లా కార్యదర్శి కాటూరి శ్రీనివాసరావు మాస్టారు, మండల ప్రెసిడెంట్లు ఆముదాలపల్లి నరేంద్ర, గడ్డం శ్రీనివాసరావు, ప్రతి బావనారాయణ ,నియోజకవర్గ నాయకులు నాగినేని సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


షేక్ కొలిమి బడే సాహెబ్(ఫైల్)

నకరికల్లు, మే 17 (ఆంధ్రజ్యోతి): గుండ్లపల్లి ఇటుకల బట్టి సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఎక్సెల్‌పై వస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గుండ్లపల్లి గ్రామా నికి చెందిన షేక్ కొలిమి బడే సాహెబ్(69) తన పొలం పనులకు ద్విచక్ర వాహ నంపై బయలు దేరాడు. ఇటుకల బట్టి సమీపాన రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతూ సాహెబ్ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన

పెదకాకాని, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యం పాత్రికేయ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ఇన్ డ్రోన్ టెక్నా లజీ డిప్లమో విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై శని వారం అవగాహన కల్పిం చారు. పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి మాట్లా డుతూ.. మేఘాలయ ప్రభుత్వ ప్లానింగ్ డిపార్ట్ మెంట్ సలహాదారుడు, వర్సిటీ పూర్వ విద్యార్థి వైకిషోర్ మెళకువలు నేర్పించారని తెలిపారు. డీజీసీఏ నిబంధనలు, యూఏవీ అప్లికేషన్స్, రిమోట్ సెన్సింగ్, గూగుల్ ఎర్త్ ఇంజన్‌లను వివరిం చారు. సీనియర్ ఫొటో గ్రాఫర్, అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ విజయ భాస్కర్‌ను అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు.

నూతన క్రీడాపాలసీ క్రీడాకారులకు వరం

● కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ ● నూతన కార్యవర్గం ఎన్నిక


ఏకగ్రీవంగా ఎన్నికైన కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

విజయవాడ(స్పోర్ట్స్), మే 17 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన నూతన క్రీడా పాలసీ వర్ధమాన క్రీడాకారులకు ఒక వరం అని ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక విజయవాడ క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ కార్యదర్శి శ్రీకాంత్ మట్లాడుతూ నూతన అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నికైందని, ఈ అసోసియేషన్ ఎకేఎఫ్ఐ గైడ్ లైన్స్ అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించిన విధంగా కబడ్డీ క్రీడను మరింత అభివృద్ధి చేస్తామని, కూటమి ప్రభుత్వం లో క్రీడల్లో రాజకీయాలు ఉండవని అన్నారు. తమ అసోసియేషన్‌కు ఎకేఎఫ్ఐ గుర్తింపు, సహకారం అందిస్తుందని, రాష్ట్రంలో నిబంధనల ప్రకారం మా అసోసియేషన్‌కి మాత్రమే గుర్తింపు, అర్హత ఉన్నాయని అన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేస్తామని, ఖేలో ఇండియాలో మెడల్ కొట్టిన ప్రతి క్రీడాకారుడికి 5 వేలు బహుమతి అందిచడం జరిగిందని తెలిపారు. గతంలో కొంతమంది కబడ్డీ క్రీడా అసోసియేషన్ పేరుతో వివాదాలు చేశారని, ఇకపై అటువంటి వాటికి ఈ ప్రభుత్వంలో చోటులేదని, త్వరలోనే బీచ్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు మణికంఠకు మూడు లక్షల రూపాయలు చెక్‌ను అందజేశారు. కార్యవర్గం ఎన్నికకు ఎకేఎఫ్ఐ అబ్జర్వర్ గా వీరేష్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షురాలిగా ప్రభావతి, వైస్ ప్రెసిడెంట్‌గా కృష్ణ, కార్యదర్శిగా యలమంచిలి శ్రీకాంత్‌లు ఎన్నికకగా, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించారు.

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య) మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకులు వీఎస్ఎస్‌వీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ మెన్ సివిల్, మెకానికల్ తదితర ట్రేడుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, మొబైల్ నంబర్, ఈమెయిల్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో లతో ఈ నెల 25లోగా దరఖా స్తు చేసుకోవాలని తెలిపారు. గుంటూరు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాలలో మొత్తం నాలుగు ట్రేడ్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు 0863-2234720, 83339 73927 ంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ప్రారంభమైన పీజీ 4వ సెమిస్టర్ మూల్యాంకనం

పెదకాకాని, మే 17(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విద్యాలయంలో పీజీ నాలుగవ సెమిస్టర్ పరీక్ష పత్రాల మూల్యాంకనం శనివారం నుంచి ప్రారంభమైందని పీజీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు తెలిపారు. మూల్యాంకనానికి సీటీపీగా ఏఎన్‌యూ పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి బాధ్యత వహించను న్నారు. ఆమె మాట్లాడుతూ వర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్, ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, ఫార్మసీ కోర్సుల్లోని అధ్యాపకులు మూల్యాంకనంలో భాగస్వామ్యం అవ్వాలన్నారు. ఆయా విభాగాల పాఠ్య ప్రణాళికా మండలి అధ్యక్షు లు ఎగ్జామినర్లను ఎంపిక చేసి, మూల్యాంక నంలో తమ వంతు సహాయ సహకారాలను అందించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు నగర పాలక సంస్థ

ఆర్.ఓ.సి.నెం.876106/2025/A2-2 ది.16-05-2025.

టెండరు కం బహిరంగ వేలము నోటీసు

గుంటూరు నగరపాలకసంస్థకు చెందిన ఆర్.టి.సి.బస్ స్టాండు ఎదురుగా గల డా.కొల్లి శారద హోల్ సేల్ కూరగాయల మార్కెట్టులో రుసుము వసూలు చేసుకొనే హక్కుకు వాటికి 2025-26 సం. నకు ది.01-06-2025 నుండి31-03-2026వరకు లీజు నిర్ధారించుకొనుటకు టెండరు కం బహిరంగ వేలం ది.26-05-2025న ఉదయం గం॥ 11.00 ల నుండి 11.30 ల వరకు మునిసిపల్ ట్రావెలర్స్ బంగ్లా నందు సీల్డు టెండర్లు స్వీకరించబడును మరియు అదే రోజు గం.11.30 ల నుండి బహిరంగ వేలం నిర్వహించబడును. బహిరంగవేలం పూర్తయిన తదుపరి కమీషనరు గారిచే గాని వారిచే నియమించబడిన అధికారిచే గాని సీల్డు టెండర్లు తెరువబడును.

వరుస సంఖ్య	ఐటెం నెం.	అయిటములు	ధరావత్తు మొత్తము	సాల్వెన్సీ/ సెక్యూరిటీ డిపాజిట్టు (రూ)	కౌలు కాలము
1	1	ఆర్టీసి బస్ స్టాండు ఎదురుగా గల డా.కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్టులో రుసుము వసూలు చేసుకొనే హక్కు	రూ.5,00,000/-	రూ.10,00,000/-	01-06-2025 నుండి 31-03-2026 వరకు

గమనిక:-

1. లీజుదారుడు / గుత్తదారుడు వేలం మొత్తంపై అమలులో ఉన్న జి.యస్.టి 18% ట్యాక్సును తప్పని సరిగా చెల్లించవలెను.
2. హెచ్చు పాట దారుడు / ఖరారు చేయబడిన పాట దారుడు తన యొక్క గాని, కంపెనీ లేఖ ఫారము యొక్క గాని, ఆర్థికపరిస్థితి తెలియజేయు పాట పాడిన మొత్తములో 25 శాతము బ్యాంకు గ్యారంటీ ఏదేని షెడ్యూలు బ్యాంకు నుండి పొంది సకాలంలో ఆఫీసుకు సమర్పించవలెను.
3. అసాధారణ రాజ పత్రము నెం.04, ది.07-02-2025 నియమ నిబంధనల ప్రకారము ఆక్షన్ జరుగును లీజుకు సంబంధించిన షెడ్యూలు ఖరీదు రూ.100/- ది.24-05-2025 సాయంత్రం గం.5-00 లోపు నగరపాలక సంస్థ యొక్క ట్రెజరీ నందు విధిగా చెల్లించి అటుల చెల్లించిన రశీదుతో సాయంత్రము గం 5.30 లోపు ఎ2-2 సీటు నందు షెడ్యూలు తీసుకొనవలెను.

టెండరు ధరావత్తు సొమ్ము ఏదైనా జాతీయ బ్యాంకు నందు కమీషనరు నగరపాలకసంస్థ, గుంటూరు వారి పేరున తప్పనిసరిగా ఒరిజినల్ డిమాండు డ్రాఫ్ట్ తీసుకొని టెండరు షెడ్యూలుకు జతపరచి దాఖలు చేయవలెను ఎట్టి పరిస్థితులలో చెక్కులు స్వీకరించబడవు. సాల్వెన్సీ మరియు ఇ.సి. టెండరుకు ఒరిజినల్ తో పాటు రిజిస్టర్ దస్తావేజు కాపీ, నోటరీ అఫిడవిట్ (under taking) తో సహా 3 రోజుల ముందు దాఖలు చేయవలెను. వేలమునకు సంబంధించి పాటలో పాల్గొనుటకు గాను MRO గారిచే జారీ చేయబడిన సాల్వెన్సీ సర్టిఫికేట్ ప్రాపర్టీ వాల్యుయేషన్ సర్టిఫికేట్ గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో మాత్రమే ఉండవలెను. బహిరంగ వేలములో కూడా ఒరిజినల్ డిమాండు డ్రాఫ్టు, ఒరిజినల్ సాల్వెన్సీ మరియు ఒరిజినల్ ఇ.సి. జతపరచవలెను. గజిట్ నోటిఫికేషన్ కాపీ మునిసిపల్ కార్యాలయము నందు రూ.250/-లు చెల్లించి పొందవలెను.

సదరు లీజులకు దాఖలు చేయబడిన టెండర్లులో హెచ్చు టెండరు గాని లేక బహిరంగ వేలములో హెచ్చు పాటను ఏది ఎక్కువైతే ఆమొత్తము ఆమోదించబడును సదరు టెండరు గాని లేదా వేలమును గాని అంగీకరించుటకు మరియు తిరస్కరించుటకు కమీషనరు గారికి అధికారము కలదు. సదరు లీజులు యొక్క టెండరు కం బహిరంగ వేలముపై పునరాలోచనకు గానీ, వాయిదా వేయుటకు గాని నగరపాలకసంస్థ కమీషనరు గారికి పూర్తి అధికారములు కలవు.

ఇతర వివరముల కొరకు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగము నందు కార్యాలయపు పనివేళల యందు ఎ2-2 గుమస్తా గారిని సంప్రదించవలెను.

సం/- కమీషనరు, నగర పాలక సంస్థ, గుంటూరు



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ సర్దార్‌బేగ్

నీటిని ఆదా చేయండి.. జీవనానికి భరోసా కల్పించండి

● అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్

బాపట్ల, మే17 (ఆంధ్రజ్యోతి) : నీటిని ఆదా చేయండి.. భవిష్యత్తు తరాల జీవనానికి భరోసా కల్పించండని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ పిలుపునిచ్చారు. కళాశాల విద్యార్థులతో కలిసి శనివారం నీరు-మీరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సీహెచ్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నీటి నిర్వహణలో ప్రజలను భాగస్వాములను చేసి అవగాహన కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థులతో కలిసి కళాశాల నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సోమేశ్వరరావు, డాక్టర్ వై.పజేంద్రకుమార్, షేక్ సుభానీ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఛలో విజయవాడ కార్యక్రమానికి తరలిరావాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.రోశయ్య

బాపట్ల, మే17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు జూన్ 5వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సమావేశానికి పెద్దఎత్తున తరలిరావాలని సంఘ అధ్యక్షుడు కె.రోశయ్య పిలుపునిచ్చారు. ఈ విషయమై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని, మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. 143 జీవోను రద్దు చేయాలని, ఏఎన్ఎంలకు అధికభారమైన యాప్‌లను తీసివేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జె.సుధాకర్, జె.మార్త, టి.కరుణరాజ్, కేవీ రమణమ్మ, రాంబాబు, సుబ్బారావు, తులసీ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.రోశయ్య, కార్యదర్శి పి.శ్రీనివాసరావు

కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధి : కమిషనర్

బాపట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి) : కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకోవచ్చు అని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని భీమావారిపాలెం తాలింఖానాలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా పేద మహిళలకు జీవనోపాధి కలిగించుటకు ప్రభుత్వం ఉచిత టైలరింగ్ శిక్షణ కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈఎల్ నారాయణ సేవలు చిరస్మరణీయం

● డాక్టర్ పీసీ సాయిబాబు

బాపట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల ఉద్యమంతోపాటు విద్యారంగంలో విశేష సేవలందించిన ఈఎల్ నారాయణ చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. నారాయణ 24వ వర్ధంతి కార్యక్రమాన్ని ఫోరం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి నారాయణ పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ సమాజహితం కోరుతూ రెండు దశాబ్దాలకు పైగా విశేష కృషి చేశారన్నారు. విజ్ఞాన సమితిని ప్రారంభించి సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు డాక్టర్ అడే బుజ్జి, సాంబశివరావు, రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.


ఈఎల్ నారాయణ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న డాక్టర్ పీసీ.సాయిబాబు, కెవి.సత్యనారాయణ తదితరులు

ఘనంగా శ్రీపోలేరమ్మతల్లి నగరోత్సవం

కర్లపాలెం, మే17 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామంలో ఉన్న శ్రీపోలేరమ్మతల్లి తిరునాళ్ళ మహోత్సవంలో భాగంగా శనివారం అక్కల రమణారెడ్డి, అరుణ దంపతులు డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో, పసుపు, కుంకుమలు అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఉంచి నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్కల రమణారెడ్డి, కుంచాల సూర్యనారాయణరెడ్డి, పెద నాగిరెడ్డి, కావూరి ముసలారెడ్డి, మురళిరెడ్డి రావి నరసారెడ్డి, కుంచాల అయ్యప్పరెడ్డి, అక్కల గోపిరెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్టు

బాపట్ల రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం స్టూవర్టుపురం పెదగ్యాంగ్‌కు చెందిన దేవర కిరణ్మయి తన ఇంట్లో ఎవరు లేని సమయంలో మూడు సవర్ల బంగారు చైన్ దొంగలించబడిందని సుమారు సంవత్సరం క్రితం ఫిర్యాదు చేసినట్టు వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ అన్నారు. ఆ కేసులోని నిందితుడైన మాదిగాని రామచంద్రకుమార్ ఆలియాస్ ప్రేమచంద్‌ను గత రాత్రి అరెస్టు చేసి అతని వద్ద మూడు సవర్లనాంతాడు రికవరి చేసి నిందితుడిని కోర్టులో హాజరు పర్చటం జరిగిందని వెదుళ్ళపల్లి ఎస్ఐ తెలిపారు.


దొంగను అరెస్టు చేసిన వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్, సిబ్బంది

ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్‌లకు నగదు బహుమతులు

బాపట్ల, మే17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆర్టీసీ డిపో పరిధిలో అత్యధిక ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు, అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లకు శనివారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. డిపోమేనేజర్ బి.శ్రీమన్నారాయణ నగదు బహుమతులతోపాటు సర్టిఫికెట్‌లు అందజేసి వారిని అభినందించారు. ఇదేస్ఫూర్తితో ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం డిపో పరిధిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాలు పరిశుభ్రం చేశారు.

బైక్ అపహరణపై కేసు నమోదు

బాపట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో పార్కింగ్ చేసిన గ్లామర్ బైక్ అపహరించారంటూ జోగి రాజారత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు పెంచాలి.. పర్యావరణాన్ని రక్షించాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
● బాపట్లలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర దివస్ ర్యాలీ


బాపట్లలో అధికారులు, నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మే17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని 9వ వార్డు మూర్తిరక్షణనగర్‌లో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధికారులు, కూటమినాయకులతో కలిసి ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ వేడి ప్రభావాలను తగ్గించటానికి ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రతి ఇంటి పెరటిలో మొక్కలు నాటాలన్నారు. ఉపాధి హామీపనులు జరుగుతున్న ప్రదేశాలలో, డ్వామాకు సంబంధించి జరుగుతున్న పనుల ప్రాంతాలలో చలివేంద్రాలు, షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మూర్తిరక్షణనగర్, చిల్లరగొల్లపాలెంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, మండల స్పెషలాఫీసర్ శివలీల, తహసీల్దార్ షేక్ సలీమా, కమిషనర్ జి.రఘునాథరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, జనసేన నాయకులు నామన వెంకటశివన్నారాయణ, విన్నకోట సురేష్, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు యడ్లమూడి వెంకటేశ్వరరావు, కూచిపూడి శ్యామ్ సుందర్, దారా అశోక్, పరిశా రమేష్‌గౌడ్, కొల్లూరి వెంకట్రావు, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, ఆర్వో అబ్దుల్ జబ్బార్, శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, చిత్రంలో డీఆర్వో, ఆర్డీవో, కమిషనర్

కొండుబొట్లవారిపాలెంలో...

బాపట్ల రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం పంచాయతీ సచివాలయ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని బాపట్ల నియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ సచివాలయ సిబ్బందితో కలిసి శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ కార్యక్రమంలో భాగంగా విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దుల కొండలు, ఉమ్మారెడ్డి వెంకటేష్, పల్లం జీవన్, వెంకయ్య, కాటూరిరత్నకుమార్, సెక్రటరి ఝాన్సీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ తదితరులు

ఖాజీపాలెంలో...

పిట్టలవానిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఖాజీపాలెం గ్రామం సచివాలయంలో మూడో శనివారం సందర్భంగా మండల, గ్రామస్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బాపట్ల డీఎల్‌డీవో, మండల ప్రత్యేకాధికారి చెరుకూరి విజయలక్ష్మి గ్రామపంచాయతీలలో మొక్కలను నాటారు. మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు తగ్గించుకునేందుకు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.భాగ్యరాజు, ఏపీవో గణపతి, ఖాజీపాలెం గ్రామసర్పంచ్ ఎ.అనూష ప్రసన్నరాజు, ఖాజీపాలెం పంచాయతీ కార్యదర్శి దాసరి వెంకటశివకుమార్, వీఆర్వో నాగరాజు, ఆయా పార్టీల నాయకులు మంతెన కృష్ణమూర్తిరాజు, దండు శ్రీనివాసరాజు, కొత్తపల్లి పృథ్వీరాజు, కూసంపూడి దేవేంద్రరాజు, అలంకార్‌రాజు, సచివాలయ ఉద్యోగులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న బాపట్ల డీఎల్‌డీవో విజయలక్ష్మి, మండల స్థాయి అధికారులు తదితరులు

చందోలు పోలీసుస్టేషన్‌లో..

పిట్టలవానిపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు పోలీసుస్టేషన్ ఆవరణలో చందోలు ఎస్ఐ ఎం.వెంకట శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్ సిబ్బందితో కలిసి స్వర్ణాంధ్ర స్వచ్ఛాభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేషన్ కూడలిలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పోలీసుస్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల పరిషత్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులు శనివారం బీట్ ద హిట్ కార్యక్రమం నిర్వహించారు.

మండలపరిషత్ కార్యాలయం నుంచి ఐలెండ్ సెంటర్ వరకు ఆపరేషన్ సిందూర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావులు అశువులు బాసిన సైనికుడు ఎం.మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, గ్రామసర్పంచ్ నక్కా లలితకుమారి, ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా, కార్యదర్శి సునీత పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, చిత్రంలో తహసీల్దార్ సుందరమ్మ

రేపల్లెలో...

రేపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రకు కట్టుబడి ప్రజలు పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పట్టణంలో మున్సిపల్ అధికారులు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు కృషి చేయాలని సూచించారు. పర్యావరణం రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, కృష్ణా పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రేపల్లెలో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు

ఎక్సైజ్ కార్యాలయంలో...

వేమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనం పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎక్సైజ్ కార్యాలయంలో మొక్కలు నాటారు. స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రవికృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.


కార్యాలయం ముందు మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

కూచిపూడిలో..

అమృతలూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈవోపీఆర్డీ మాదినేని రవిశంకర్ అన్నారు. మండల పరిధిలోని కూచిపూడిలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ అధికారులతో చేయించారు. గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సూపరింటెండెంట్ వాణి, ఏపీఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కూచిపూడిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఈవోపీఆర్డీ రవిశంకర్ తదితరులు

భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో..

భట్టిప్రోలు, కొల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : మూడవ శనివారం పురస్కరించుకుని భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో తిరంగా ర్యాలీ జరిపారు. భట్టిప్రోలులో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎండ తీవ్రత తగ్గించుకోవడంపై తీసుకోవాల్సిన చర్యలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తిరంగ ర్యాలీని నిర్వహించారు. కొల్లూరులోని ఎంపీడీవో కార్యాలయం వద్ద తిరంగా ర్యాలీ, స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలలో భాగంగా మండల ప్రత్యేక అధికారి చలివేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ర్యాలీగా బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారి బి.వేణుగోపాల్, ఎంపీడీవోలు ఎస్.వెంకటరమణ, కె.నరసింహారావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, కొల్లూరు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, కొల్లూరు, భట్టిప్రోలు పంచాయితీ కార్యదర్శులు బి.మల్లిఖార్జున, కోటా శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కిరణ్మయి, విజయలక్ష్మి, ఉపసర్పంచ్ ధూళిపూడి కృష్ణ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


కొల్లూరులో స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

యువకుడి అదృశ్యం

కర్లపాలెం, మే17 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం రాజీవ్ నగర్ గ్రామానికి చెందిన జె.సురేష్ శుక్రవారం నుంచి కనిపించటంలేదని జె.విజయ శనివారం కర్లపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయలు దేరి అతను అర్ధరాత్రి దాటినా కూడా ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భర్త కనిపించటంలేదని ఫిర్యాదు

బాపట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైలుపేటకు చెందిన రామస్వామి (65) ఈనెల 10వ తేదీ నుంచి కనిపించటంలేదని భార్య అయ్యర్ రాణి శనివారం ఫిర్యాదు చేసినట్లు సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. మతిస్థితిమితం సరిగ్గాలేని ఆయన బయటకు వెళ్ళి రాకపోవటంతో చుట్టుపక్కల విచారించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పట్టణ ఎస్ఐ చంద్రావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీరాంజనేయస్వామికి విరజాజి పూల అర్చన

వేమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారికి విశేషంగా విరజాజి పూలతో అర్చన జరిపారు. ఉదయం నాదెండ్ల సురేష్‌బాబు దివ్య దంపతులు పంచామృతాభిషేకం జరిపించారు. పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం పల్లకి ఉత్సవం జరిపి స్వామికి అష్టోత్తర సహస్రనామ పూజ నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల దాస సాహిత్య ప్రాజెక్టు భజన సమాజం వారు, వీరాంజనేయ కోలాట భజన సమాజం వారు హనుమాన్ చాలీసా పారాయణ భజన కీర్తనలు ఆలపించిన అనంతరం కోలాట భజన జరిపారు.


విరజాజి పూల అర్చనలో వీరాంజనేయస్వామి

పంట కాల్వల్లోని వ్యర్థాలు పరిశీలన

● రెండు రోజులలో తొలగిస్తామని కార్యదర్శి హామీ


పంట కాల్వల్లోని వ్యర్థాలను పంచాయతీ కార్యదర్శికి చూపిస్తున్న మహిళా రైతులు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 17 (ఆంధ్రజ్యోతి) : పంట కాల్వను వ్యర్థాలతో నింపి వేస్తున్నారని మహిళా రైతులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని ఓలేరు గ్రామంలో సర్వే నెంబరు 107 వెంట ఉన్న పంట కాల్వలో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న కుటుంబాల వారు వ్యర్థాలు వేయడంతో పంట కాల్వ మొత్తం చెత్తా చెదారంతో నిండిపోయి అధ్వాన్న స్థితికి చేరింది. సర్వే నెంబరు 106లో 55 సెంట్లు భూమి కలిగిన భూ యజమాని అంచె రోజారాణి తమ పొలం ఎదుట ఉన్న పంట కాల్వ వ్యర్థాలతో నిండిపోయిందని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు స్పందించిన కార్యదర్శి మామ్‌జీ నాయక్ పంట కాల్వను పరిశీలించి మహిళా రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. రెండు రోజుల గడువు ఇస్తే పంట కాల్వ మొత్తం వ్యర్థాలు లేకుండా శుభ్రం చేయిస్తానని మహిళా రైతులకు హామీ ఇచ్చారు. మళ్లీ కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా నివాసితులకు నోటీసులు ఇవ్వాలని కోరారు.

వేమూరులో వరల్డ్ హైపర్‌టెన్షన్ డే


సదస్సులో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా పర్వీన్

వేమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం వరల్డ్ హైపర్‌టెన్షన్ డే నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా పర్వీన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోగులకు అధిక రక్తపోటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తపోటుకు అధిక ఒత్తిడి, దురలవాట్లు ప్రధాన కారణంగా ఉంటాయన్నారు. 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ రక్తపోటు పరీక్షను తప్పనిసరిగా చేయించుకుంటూ ఉండాలన్నారు. సదస్సులో వైద్యులు ఎస్.శ్రీనివాసరావు వి.అనీల్‌కుమార్, వీరవల్లి రాధిక, సునీత, హెడ్ నర్సు పద్మావతి, ఫార్మసిస్టు చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

● రహదారుల దిగ్బంధనంతో ఉద్రిక్తత

కొల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ రహదారుల దిగ్బంధనంతో ఉద్రిక్తతలకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దోనేపూడిలోని మగ్గాలపాలేనికి చెందిన ఓ వ్యక్తి కొల్లూరులోని దళితవాడలో ఓ వ్యక్తిని ప్రధాన బజారుకు ఎటు వెళ్లాలని అడుగగా ఆ వ్యక్తి దారి చూపించాడు. కొంత దూరం వెళ్లాక మరో వ్యక్తి ఇటు కాదు వెనక్కి వెళ్లాలని సూచించడంతో తిరిగి వెనక్కి వస్తున్న క్రమంలో మొదటిగా దారి చెప్పిన వ్యక్తి ఇటు ఎందుకు వస్తున్నావని, అటువంటప్పుడు నన్ను ఎందుకు అడిగావని చొక్కా పట్టుకోవడం ఘర్షణ మొదలైంది. మగ్గాలపాలేనికి చెందిన వ్యక్తి జరిగిన విషయాన్ని తన అన్నదమ్ములకు ఫోన్ చేసి చెప్పడంతో వారు కొల్లూరుకు చేరుకుని చొక్కా పట్టుకున్న వ్యక్తి ఇంటికి వెళ్లి మరీ ఘర్షణ పడ్డారు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి మగ్గాలపాలేనికి చెందిన ముగ్గురు వ్యక్తులపై ఎదురు దాడి చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా కొల్లూరు దళితవాడకు చెందిన వ్యక్తులు పోలీస్‌స్టేషన్ బయట సంచరిస్తుండగా పోలీసులు జీపులో వారిని సురక్షితంగా మగ్గాలపాలెంకు తీసుకు వెళ్లారు. తమపై దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేయాలేదంటూ కొల్లూరు దళితవాడకు చెందిన వారు శనివారం రాత్రి రహదారులను దిగ్బంధనం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న సీఐ వీరాంజనేయులు ఆందోళనకారులతో చర్చిస్తున్నారు. రాత్రి 10 గంటల వరకు కూడా విషయం ఓ కొలిక్కి రాలేదని సమాచారం.

మురళీమోహన్ సేవలు అభినందనీయం

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్


మురళీమోహన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

భట్టిప్రోలు (కొల్లూరు), మే 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ సమాజసేవలో ముందున్న గుర్రం మురళీమోహన్ అభినందనీయులని ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ పేర్కొన్నారు. గుంటూరులోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో ఓల్డ్ లైబ్రేరియన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగుల కోసం మురళీమోహన్ చేస్తున్న సేవలను కొనియాడటంతో పాటు సమాజ సేవలో నిమగ్నమై డాక్టరేట్ సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మురళీమోహన్‌ను దుశ్శాలువా, మెమోంటోతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, అచ్చమాంబ, గిరిబాబు, శివప్రసాద్ పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ వద్ద వేసవి చలివేంద్రం

కర్లపాలెం, మే17 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం ఎట్రవారిపాలెం పంచాయతీ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ వద్ద శనివారం వేసవి చలివేంద్రం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిని ఈ-హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేస్తాం

- నాట్కో కేన్సర్ విభాగానికి గ్రేడ్-1 సెంటర్‌గా గుర్తింపు
- త్వరలో రూ.10 కోట్లతో సర్వీస్ బ్లాక్ నిర్మాణ పనులు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

గుంటూరు మెడికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిని ఈ-హాస్పిటల్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి,కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. మెడికల్ రికార్డుల ఎలక్ట్రానిక్ డాక్యుమెంటేషన్ కోసం ఈ-ఆఫీస్‌కు అవసరమైన 300 కంప్యూటర్లను సాఫ్ట్ వేర్ కంపెనీల సహకారంతో అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. శనివారం గుంటూరు నాట్కో సెంటరు సెమినార్ హాలులో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని వైద్య సేవలపై రోగుల సంతృప్తి స్థాయిని మరింత మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనుపత్రిలో మధురాన్నం ట్రస్ట్ ద్వారా జరుగుతున్న అన్నదానం మినహా మిగిలిన వారు అన్నదానం చేయకుండా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. దాతలు దానికి బదులు వీల్ చైర్ వంటివి అందజేయాలని ఆయన సూచించారు. నాట్కో క్యాన్సర్ సెంటరులో 120 పడకలతో పాటు అదనంగా మరో 150 పడకలకు విస్తరిస్తున్నందున ప్రభుత్వం క్యాన్సర్ చికిత్స లెవల్ వన్ ఆసుపత్రిగా గుర్తించినట్లు డాక్టర్ పెమ్మసాని తెలిపారు. పెట్ స్కాన్‌ను ప్రారంభించనున్నందున దీనికి అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించుకోవటానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

నర్సింగ్ కళాశాలకు బస్సు విరాళం

ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని నర్సింగ్ పాఠశాలకు రూ.35 లక్షల విలువైన బస్సును విరాళంగా ఇచ్చేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, హెచ్‌డీఎస్ సభ్యుడు తులసీ రామచంద్రప్రభు సమావేశంలో ప్రకటించారు. అదేవిధంగా ఆసుపత్రి ఆవరణలో రూ.10 కోట్లతో చేపట్టే సర్వీస్ బ్లాక్ ఎంఓయు పత్రాలను కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులతో కలసి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి.. రామచంద్ర ప్రభు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని తదితరులు రామచంద్రప్రభును సత్కరించారు. అనంతరం డాక్టర్ యశస్వీ రమణ ప్రచురించిన జీజీహెచ్ సుఖీభవ సమాచార దర్శిని పుస్తకాన్ని మంత్రి, ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎంవోయూను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కి అందజేస్తున్న తులసి రామచంద్రప్రభు

ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

● రోడ్లు ఊడ్చి, మురుగుతీసిన మంత్రి మనోహర్ ● మురుగు కాల్వల నిర్వహణపై ఆగ్రహం ● సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లాల్సిందే..

తెనాలి, మే 17, (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉంటే పట్టణంలోని పౌరులంతా ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొ న్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తెనాలిలోని శివాజీ చౌక్ వద్ద నుంచి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ కార్యాలయం వరకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లోనూ పర్యటించారు. ఈ సందర్భంగా జనం తమ సమస్యలపై వినతిపత్రాలు అందించి, ఏకరవు పెట్టారు. ఓపికగా వృద్ధులు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి మంత్రి సమాధానమిచ్చారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో నిర్వహిస్తామని, ప్రజలు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సచివాలయ సిబ్బంది కూడా ఇకపై ఇంటింటికీ వెళ్లి.. ప్రజల సమస్యలు పరిష్కారంచేసేలా 'ఇంటింటికీ సచివాలయ సిబ్బంది' కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రజలకు మరింత చేరువ అవుతామని, నడవలేని వృద్ధులు, ప్రత్యేక అవసరాలవారికి ఆసరాగా నిలిచేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. అనంతరం పూడిక సరిగా తీయకపోవడంతో రోడ్లపైకి నీరు చేరేలా ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో మొత్తం కాల్వల పూడిక తీయాలని మున్సిపల్ కమిషనర్ శేషన్నను ఆదేశించారు. వర్షం వచ్చినప్పుడు చుక్క నీరు కూడా రోడ్లపై నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. తడిచెత్త, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని దేశంలోనే తెనాలిలో ఎప్పుడో ప్రారంభించామని, ఇది దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని మనోహర్ పేర్కొన్నారు.



మార్కెట్ సెంటర్‌లో చీపురుపట్టి చెత్త ఊడ్చుతున్న మంత్రి మనోహర్, సబ్‌కలెక్టర్ సంజనా సింహ తదితరులు

జగనన్న కాలనీల కాంట్రాక్టర్లపై కేసులు పెట్టండి

జగనన్న కాలనీ లబ్ధిదారులు తమ సమస్యలను మంత్రి మనోహర్ దృష్టికి తీసుకొచ్చారు. గుత్తేదారులు ఇంటి నిర్మాణానికి అదనంగా ఖర్చవుతుందంటూ రూ. 50 వేల నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేశారని తెలిపారు. అయినా.. ఇంటిని నిర్మించకపోగా డబ్బు కూడా తిరిగి ఇవ్వడం లేదని, అప్పట్లో అడిగితే తమపైనే దౌర్జన్యం చేశారని వాపోయారు. దీంతో స్పందించిన మంత్రి పేదల సొమ్ము తీసుకున్న వారిని వదలమని, వారి దగ్గర నుంచి డబ్బు వసూలు చేసి బాధితులకు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులను మోసగించి డబ్బు వసూలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డీఎస్పీ జనార్దనరావును ఆదేశించారు. అంతా పేదలేనని, అప్పులు చేసి మరీ సొంతింటి కోసం అధిక వడ్డీలకు డబ్బు తెచ్చిస్తే వాటిని నొక్కేసి, ఇళ్లు కట్టకుండా పేదలను మోసం చేయడం దారుణమని, వారిని వదలడానికి వీల్లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రితోపాటు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ అధికారి నజీమా బేగం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మిస్తామంటూ తమ దగ్గర డబ్బు తీసుకుని ఇళ్లు కట్టకుండా వదిలేశారంటూ మంత్రికి ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ఆశలపై అకాల వర్షం

❖ వాతావరణ మార్పులతో నిమ్మరైతు దిగాలు ❖ పూత రాలి.. తగ్గిన దిగుబడులు ❖ ఎగుమతులు నిలిచి.. ధర నేల చూపులు ❖ కేజీ రూ.80 నుంచి రూ.40 పతనం



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కార్మికులు



చెట్టుకు తక్కువ సంఖ్యలో పిందె దశలో ఉన్న నిమ్మకాయలు

తెనాలి రూరల్,మే17(ఆంధ్రజ్యోతి): తెనాలి వ్యవసాయ మార్కెట్ నిమ్మకాయల క్రయ విక్రయాలకు పెట్టింది పేరుగా విరాజిల్లుతుంది. ఇక్కడకు తెనాలి, కొల్లిపర, చుండూరు, దుగ్గిరాల వంటి పలు మండలాల నుండి వేలాది ఎకరాల్లో సాగుచేపట్టిన నిమ్మరైతులు కాయలను తెచ్చి మార్కెటింగ్ చేస్తుంటారు. వ్యాపారులు లక్నో, యూపీ, జార్ఖండ్, నేపాల్ వంటి పలు ప్రాంతాలకు ఎగుమతులు చేస్తుంటారు. వేసవి కాలంలో కాయలకు డిమాండ్ ఉండి మంచి ధరలు పలుకుతాయి. దీంతో వేసవిపైనే రైతాంగం ఆశలు పెట్టుకుంటారు. నిమ్మసాగుకు దాదాపుగా సంవత్సరానికి రూ.60 - 80వేల వరకూ పెట్టుబడి అవుతుంది. దీనికి దిగుబడి మూడు దఫాలుగా వస్తాయి. వాతావరణం పూర్తి అనుకూలంగా ఉండి కాపు నిలబడితే రైతు ఆశించినంత దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

వాతావరణం మార్పులతో..

గతేడాది వాతావరణంలో మార్పులతో తొలి కోత ఆశాజనకంగా ఉన్నా.. రెండో కోతలో ఓ మాదిరిగా రైతులు నిలదొక్కుకున్నారు. మూడో కోత నుండి వాతావరణంలో మార్పులతో పూత రాలిపోయింది. దీంతో నిమ్మ దిగుబడి తగ్గింది. డిమాండ్‌కు తగ్గకాయలు లేకపోవడంతో వాటికి ధరలు పెరిగాయి. గత నెలలో కేజీ రూ.130 పలుకగా అదే నెల చివరకు వచ్చే సరికి రూ.80కి ధర దిగిపోయింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ఎగుమతులు తగ్గాయి. దీంతో వారం క్రితం వరకూ కేజీ నిమ్మకాలు రూ. 60 కాగా ప్రస్తుతం రూ.40కి పడిపోయాయి. దీంతో రైతులు గిట్టుబాటు కాదని దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం నిమ్మకాలు ధర ఏ గ్రేడ్ క్వింటా రూ.4 వేలు, బీ గ్రేడ్ రూ.3300గా ఉంది. అకాల వర్షాలే తమ పంటలను దెబ్బతీశాయని రైతులు చెబుతుండగా.. వర్షాల కారణంగా కాయలకు డిమాండ్ లేక ఎగుమతులు నిలిచిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు.

లోప 'భూ'యిష్టం

● అన్నదాత సుఖీభవ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ● వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో కనపడని ఖాతా నంబర్లు ● పొరుగు రాష్ట్రాల్లో ఉండే రైతులకు చుక్కెదురు



వేమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల కోసంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియ లోపభూయిష్టంగా ఉంది. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న రైతుల ఖాతా నంబర్లు వ్యవసాయ శాఖ రికార్డుల్లో చాలా వరకు కనబడడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన రైతులకు చుక్కెదురవుతోంది. సొంత భూమి ఉండి ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న వారికి సంబంధించిన భూమి ఖాతా నంబరు అసలు రిజిస్టర్ కావడం లేదు. 2025లో పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు అయిన రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. రెండు ఖాతా నంబర్లు ఉన్న యజమానికి ఒకే ఖాతా నంబరుకు సంబంధించిన భూమి మాత్రమే రిజిస్టర్ అవుతోంది. దీనికి తోడు ఎప్పటికప్పుడు సర్వర్ పని చేయకపోవడంతో దరఖాస్తు ప్రక్రియ ఆగిపోతోంది. వ్యవసాయ శాఖ సిబ్బంది తమ వద్ద మ్యాపు కానటువంటి రైతులను సచివాలయంలో మ్యాపింగ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఈ ప్రయత్నం కూడా విఫలం అవుతోంది. మ్యాపింగ్ కానీ రైతులు.. వెబ్‌సైట్‌లో మరో ఆప్షన్ ఇవ్వకపోవడంపై రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టి అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం అమలు అయ్యే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని, సాంకేతిక పరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

స్మార్ట్ హీట్ అలర్ట్ కార్డు ఆవిష్కరణ

తాడేపల్లి (కుంచనపల్లి), మే 17, (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ఉన్న విపత్తుల సంస్థ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్.. వేడిని తరిమి కొట్టండి థీమ్‌లో భాగంగా సంస్థ రూపొందించిన స్మార్ట్ హీట్ అలర్ట్ కార్డును స్పెషల్ సీఎస్ జయలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాడేపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు మజ్జిగ, వాటర్ బాటిల్‌తో పాటు స్మార్ట్ హీట్ ఎలెర్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ ప్రాంతంలో నమోదవుతున్న ఉష్ణోగ్రతల వివరాల కోసం కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని తెలిపారు. గంట గంటకు స్థానికంగా ఉష్ణోగ్రతల అంచనా వివరాలు వాటిలో ఉంటాయని..అప్రమత్తంగా వ్యవహరించి వడదెబ్బ బారి నుండి బయటపడొచ్చన్నారు. ఉష్ణోగ్రతల హెచ్చరికలు రంగుల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. బ్లూ కలర్ 35 డిగ్రీల సెంటిగ్రేడ్ అంతకంటే తక్కువ ఉంటే సేఫ్ జోన్ అని, ఎల్లో కలర్ 35-40 డిగ్రీల సెంటిగ్రేడ్ కొంచెం అసౌకర్యమని, ఆరెంజ్ కలర్ 41-44 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉంటే ఎక్కువ అసౌకర్యమని, రెడ్ కలర్ 45 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే ఎక్కువ ఉంటే తీవ్ర ప్రమాదం కలిగి ఉంటుందని జయలక్ష్మి చెప్పారు. అత్యవసర సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112, 1800 4250 101లో సంప్రదించాలన్నారు.



కార్డును ఆవిష్కరిస్తున్న స్పెషల్ సీఎస్ జయలక్ష్మి

ప్రవేశాలు పరిమితం..!

◆ ఏఎన్‌యూ పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్ల కోత ◆ ఆగమేఘాలపై తాత్కాలిక వీసీ, రిజిస్ట్రార్ నిర్ణయం ◆ ఈ మేరకు విభాగాధిపతులకు ఆదేశాలు ◆ పాలక మండలి సభ్యులకు లేని సమాచారం



పెదకాకాని, మే 17(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తాత్కాలిక అధికారులు నిర్ణయాలు విమర్శలకు తావిస్తున్నాయి. తాజాగా వర్సిటీ తాత్కాలిక ఉన్నతాధికారులు పీజీ కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇది పలు అనుమానాలు, అనేక సందేహాలకు దారితీస్తోంది. ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ఆయా విభాగాలకు కేటాయించిన సీట్ల సంఖ్యను తగ్గించాల్సిన అవసరం ఏముందని అధ్యాపకులు అంటున్నారు. వర్సిటీలోని విద్యార్థులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోంది. అతి తక్కువ ఫీజుతో ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ వర్సిటీలు, విద్యా కేంద్రాలను తమ ఉన్నత విద్యకు మార్గంగా ఎంపిక చేసుకుంటున్నారు. పీజీ కోర్సుల్లో సీట్ల సంఖ్యను తగ్గించడం.. పేద, మధ్య తరగతి విద్యార్థులను ఆ కోర్సులకు దూరం చేయడమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పీజీ సైన్స్ కోర్సుల సీట్లకు ఎసరు

వర్సిటీలోని పీజీ సైన్స్ కోర్సుల్లో సీట్లకు వర్సిటీ ఉన్నతాధికారులు ఎసరు పెడుతున్నారు. బోటనీ, బయో టెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఫారెస్ట్రీ తదితర వాటిలో కోర్సుకు 10 నుంచి 15సీట్లు కోత పెడుతున్నారు. దీంతో పేద విద్యార్థులకు పీజీ కోర్సులు మరింత భారం కానున్నాయి.

ప్రైవేటుకు మేలు చేకూర్చేందుకా?

ఏఎన్‌యూలో కొన్ని విభాగాల్లో, ప్రత్యేక కోర్సుల్లో సీట్ల సంఖ్యను పెంచడం జరిగింది దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడే విద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని ప్రైవేటు కళాశాలలకు లబ్ధి చేకూర్చేందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు అంటున్నారు. సాధారణంగా ఇలాంటి నిర్ణయాలు వర్సిటీ పాలక మండలి సభ్యులతో చర్చించి, వారి సలహాలు సూచనలతో ముందుకు సాగాలి. కానీ, పాలక మండలి సభ్యులకు ఏ మాత్రం సమాచారం లేకుండా.. వర్సిటీ రెక్టార్ కూడా సమావేశంలో పాల్గొనకుండానే తాత్కాలిక వీసీ కంచర్ల గంగాధరరావు, తాత్కాలిక రిజిస్ట్రార్ జి.సింహాచలం, కొందరు విభాగాధిపతులు అంతర్గత సమావేశం నిర్వహించారు. వారే నిర్ణయాలు తీసుకుని పలువురు అధ్యాపకులకు అనధికార ఆదేశాలు జారీ చేయడంతో ఆచార్యులు అవాక్కవుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, విద్యా శాఖాధికారులు, విద్యా శాఖ మంత్రి వర్సిటీలో విద్యార్థులకు నష్టం వాటిల్లేలా తీసుకుంటున్న నిర్ణయాలను పర్యవేక్షించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

పరిశ్రమలకు మోక్షమెప్పుడు?

- వైసీపీ హయాంలో కుదేలైన రంగం
- జిల్లాల విభజనతో గుంటూరుకు తీవ్ర నష్టం
- పరిశ్రమలున్నా పల్నాడు పరిస్థితి అధ్వాన్నం
- లెక్కకు మాత్రమే పరిమితమైన ఎంఎస్‌ఎంఈలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కనిపించని మార్పు

గుంటూరు, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అత్యంత కీలకమైన జిల్లాగా పేరుపొందిన గుంటూరులో గడిచిన ఆరేళ్లగా పారిశ్రామిక ప్రగతి అన్నదే కనిపించడం లేదు. గత వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు పరిశ్రమలు రాష్ట్రం వైపు చూసిన దాఖలాలే లేవు. ఆ ప్రభావం జిల్లాపై తీవ్రంగా పడింది. పోయిన అయిదేళ్లలో జిల్లాలో ఒక్కటంటే ఒక్కటి కూడా భారీ పరిశ్రమ వెలుగులోకి రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అప్పటి నాయకుల బెదిరింపులు, వేధింపులు తాళలేక చాలా మంది పక్కచూపులు చూశారు. అప్పటి అధికార పార్టీనేతలకు కప్పం కట్టలేక పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా పరిస్థితిలో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు.

● జిల్లాల విభజనతో భారీ దెబ్బ

జిల్లాల విభజనతో విభజిత గుంటూరుకు తీవ్ర అన్యాయం జరిగింది. మెజారిటీ పరిశ్రమలన్నీ పల్నాడుకు వెళ్లిపోయాయి. జిల్లాలో ఉన్న స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు దాదాపు ఖాయిలా అంచుకు చేరుకున్నాయి. అవి మూసివేత ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. పొగాకు ఆధారిత పరిశ్రమల పరిస్థితి కూడా ఆశించినంత స్థాయిలో లేదు. 2022 ఏప్రిల్‌లో జరిగిన జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.250 కోట్లు అంతకు మించి పెట్టుబడులున్న భారీ పరిశ్రమలు 81 ఉండగా, వాటిలో 53 పరిశ్రమలు పల్నాడు జిల్లాకే దక్కాయి. చెట్టినాడు, కేసీపీ, పరాశక్తి వంటి భారీ సిమెంటు పరిశ్రమలు, పిడుగురాళ్ల కేంద్రంగా ఉన్న సున్నపు బట్టీల పరిశ్రమ, చిలకలూరిపేట స్పిన్నింగ్, టెక్స్‌టైల్స్ హబ్‌లు అన్నీ పల్నాడు పరమయ్యాయి. ఈ జిల్లాలో కూడా కొత్తగా వచ్చిన పరిశ్రమలు లేవు. సము ద్రతీరం, ఆక్వారంగం విస్తారంగా ఉన్న బాపట్ల జిల్లా పరిస్థితి కూ డా ఇంచుమించు అలానే ఉంది. బాపట్ల జిల్లాకు 2 భారీ పరిశ్ర మలు పోగా మిగిలిన 26 పరిశ్రమలతో గుంటూరు జిల్లా సరిపుచ్చుకోవాల్సి వచ్చింది.

● ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల గుట్టు

జిల్లాల పునర్విభజన నాటికి ఉమ్మడి గుంటూరులో 15,938 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు ఉండగా, 8 వేల ఎంఎస్‌ఎంఈలు పల్నాడుకు, 1500 ఎంఎస్‌ఎంఈలు బాపట్ల జిల్లాకు వెళ్లాయి. గుంటూరు జిల్లాకు 6,425 పరిశ్రమలు మాత్రమే మిగిలాయి. ప్రస్తుతం ఈ సంఖ్య భారీగా పెరిగింది. గుంటూరు జిల్లాలో 94,189 ఎంఎస్‌ఎంఈలు ఉండగా అందులో సూక్ష్మ పరిశ్రమలే 90,911 ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 27,950 ఎంఎస్‌ఎంఈలు ఉండగా, వాటిలో 27,758 సూక్ష్మ పరిశ్రమలు, పల్నాడు జిల్లాలో 34,990 ఎంఎస్‌ఎంఈలకు గానూ 34,695 సూక్ష్మ పరిశ్రమలు ఉన్నాయి. మొత్తం ఎంఎస్‌ఎంఈల్లో 95 శాతానికి పైగా సూక్ష్మ పరిశ్రమలే ఉన్నాయి. గణాంకాలను బట్టి ఎంఎస్ ఎంఈల సంఖ్య పదిరెట్లు పెరిగినట్లు కనిపిస్తున్నా.. దాని వెనక పెద్ద మ తలబు ఉన్నట్లు తెలుస్తోంది.ఎంఎస్‌ఎంఈల భావన మార్చడంతో ఈసంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఇళ్ల దగ్గర నడుపుకునే చిల్లరకొట్లు, దుకాణాలు ఎంఎస్‌ఎంఈల జాబితాలో చేర్చారు. కానీ కొత్తగా వచ్చిన ఎంఎస్‌ఎంఈలు జిల్లాలో పెద్దగా లేవని తెలుస్తోంది.

● రెండేళ్లలో వచ్చిన పరిశ్రమలు, ఉద్యోగాలు శూన్యం

2014- 19 నాటి టీడీపీ ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తి చూపారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారంతా కనుమరుగైపోయారు. ప్రభుత్వ గణాంకాలే ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం 2014 నుంచి 2021 వరకూ జిల్లాలో 20 మెగా, భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా, ఆ తరువాత ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. 2014- 21 మధ్య కాలంలో గుంటూరు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 4, పల్నాడు జిల్లాలో అత్యధికంగా 9, మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 20 మెగా భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా 2,485.47 కోట్ల రూపాయల పెట్టుబడులు, 4,500 మందికి ఉద్యోగాలు వచ్చాయి. 2021-24 మధ్య ఈ మూడు జిల్లాల్లో ఒక్క భారీ పరిశ్రమగానీ, రూపాయి పెట్టుబడిగానీ, ఒక్కరికి ఉద్యోగం కానీ రాలేదని గణాంకాలు చెబుతున్నాయి. కాగా ఈ ఏడాది కాలంలోనూ అదే పరిస్థితి కొనసాగుతుండడం విషాదం



● ఐదేళ్ల గ్రహణం వీడేనా?

గడిచిన ఐదేళ్లలో పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన అనేది జిల్లాలోని యువతకు కలగానే మిగిలిపోయింది. ఖనిజ, సహజ వనరుల ఖిల్లాగా ఉన్నా, రోడ్లు, రైల్వే వంటి మౌలిక సదుపాయాల కల్పన విస్తారంగా ఉన్నా జిల్లాలో పారిశ్రామిక ప్రగతి అంతకం తకూ దిగజారిపోతోంది. ఈ కారణంగా జిల్లాలోని యువతకు పని దొరకడమే కష్టంగా మారిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశించినవారికి నిరాశే ఎదురవుతోం ది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్కువ పెట్టుబడితో, ఎక్కువ ఉపా ధి కల్పించే ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించాలని కోరుతున్నారు.

అవీ..ఇవీ..

భగవద్గీత ఆన్‌లైన్ పరీక్ష పోటీలో పర్చూరు వాసికి బంగారు పతకం



అవార్డు అందుకుంటున్న కోడూరి లక్ష్మీ, పక్కన శేషబ్రహ్మచారి

పర్చూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షలో ఈ ఏడాది పర్చూరుకు చెందిన కోడూరి లక్ష్మీకి బంగారు పతకం దక్కింది. ఈ సందర్భంగా మైసూర్ దత్తపీఠంలో శనివారం స్వామీజీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఆధ్యాత్మికత జ్ఞానానికి ప్రతీకగా నిలిచే భగవత్‌గీతపై పట్టు సాధించి ప్రతిభను కనపరిచిన లక్ష్మీని పలువురు అభినందించారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ బహూకరణ



దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : నలుగురు చిన్నారి దివ్యాంగులకు రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు వీల్‌చైర్స్ అందజేశారు. స్థానిక రోటరీ సామాజిక భవనంలో శనివారం అందుకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నలుగులు చిన్నారులు నడవలేక, నడుము క్రింద భాగము నుండి ఆరోగ్యంగా లేక నడవలేని స్థితిలో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, సురేష్, పోలుదాసు రామకృష్ణ, శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణ, ప్రసాద్, హేమంత్‌కుమార్, జె సురేష్, ప్రతాప్, బాబురావు, పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థలం కేటాయింపు



మంజూరుపత్రం అందజేస్తున్న తహసీల్దార్

అద్దంకి, మే 17 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ఎట్టకేలకు గ్రంథాలయం నిర్మాణానికి స్థలం కేటాయించారు. అద్దంకి పట్టణంలో ఐదు దశాబ్దాలుగా గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఎట్టకేలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్థలం కేటాయింపు పై ప్రత్యేక దృష్టి సారించి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్ఎస్‌పీ కార్యా లయం ఆవరణలో 10 సెంట్లు స్థలం కేటాయిస్తూ తహసీల్దార్ శ్రీచరణ్ మంజూరు పత్రంను లైబ్రరీ రికార్డు అసిస్టెంట్ వసుంధరదేవికి అందజేశారు. రిటైర్డ్ లైబ్రేరియన్ సుగుణరావు, అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు. స్థలం కేటాయింపుకు కృషి చేసిన విద్యుత్ శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్, తహసీల్దార్ శ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం స్పందనపై పొగాకు రైతుల హర్షం

పర్చూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతుల సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందనపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బర్లీ పొగాకు కొనుగోలు జరగక రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయారు. దీంతో రాష్ట్ర ఉన్నతశాఖ అధికారుల సారధ్యంలో కంపెనీ ప్రతినిధులు, రైతులతో ఇటీవల పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత తరుణంలో బర్లీ రైతులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో దీనిపై కేంద్రప్రభుత్వాని రాష్ట్ర వ్యవసాయ శాఖ ద్వారా లేఖ కూడా రాయించారు. ఆయా కంపెనీల ద్వారా పొగాకును కొనుగోలు జరిగేలా ఆదేశాలు కూడా జారీచేశారు. దీనికి సంబంధించిన పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను కూడా ఏర్పాటు చేసేవిధంగా ఆదేశాలు జారీచేశారు. కొనుగోలు లేక నైరాశ్యంలో ఉన్న బర్లీ రైతులకు ముఖ్యమంత్రి చొవర కొంత ఊరటను చేకూర్చినట్లయ్యింది.

యద్దనపూడిలో ఆపరేషన్ సిందూర్ ర్యాలీ



యద్దనపూడి గ్రామంలో ఆపరేషన్ సిందూర్ ర్యాలీలో ఉద్యోగులు

యద్దనపూడి, (మార్టూరు)మే17: యద్దనపూడి గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దారు కె రవి కుమార్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనలు మేరకు రెవెన్యూ ఉద్యోగులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది జాతీయజండాలను చేతబూని, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రికి వాట్సాప్‌లో వినతులు

● తొమ్మిది రకాల సమస్యలపైనే అధికం

ఒంగోలు విద్య, మే 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజనకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వాట్సాప్‌లో వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఆయన మెయిల్‌కు కూడా వీటిని పంపుతున్నారు. ఉపాధ్యాయులుకానీ, ఇతరులు కానీ ఎవరైనా సమస్యలను తన వాట్సాప్‌కు పంపిస్తే స్పందిస్తానని మంత్రి లోకేష్ ప్రకటించారు. పాఠశాల విద్య కమిషనర్ ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించే సమావేశాల్లో సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో ఉపాధ్యాయులు నేరుగా విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు తమ తొమ్మిది డిమాండ్ల పరిష్కారం కోరుతూ వినతులు పంపుతున్నారు. ఫౌండేషన్ స్కూళ్లలో 1,2 తరగతులే కాకుండా 1నుంచి 5 తరగతులు కొనసాగిస్తూ కనీసం ఇద్దరు టీచర్లను నియమించాలని, విద్యార్థులకు తెలుగు మీడియంలో చదువుకొనే అవకాశం కల్పించాలని, మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ఎస్‌జీటీలను హెచ్‌ఎంలుగా నియమించాలని ఎక్కువ మంది కోరుతున్నారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 120 దాటితే ఒక హెచ్‌ఎం, ఐదు ఎస్‌జీటీ పోస్టులు ఇవ్వాలని, హైస్కూళ్లలో 1నుంచి 5 తరగతుల విలీనం ప్రతిపాదనను విరమించాలని, హైస్కూళ్లలో ఉపాధ్యాయులకు వారానికి 32 పీరియడ్ల పనిభారం మించకుండా చూడాలని తదితర సమస్యలతో లోకేష్‌కు వాట్సాప్‌లో వినతులు పంపుతున్నారు.

ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు







ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపాకుల అర్చన, మూలవిరాట్‌కు అభిషేకం చేస్తున్న ఈవో తిమ్మనాయుడు, రిషిత దంపతులు, యాగశాలలో పూజలు

అద్దంకి, మే17 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మహాకుంభాభిషేకం, జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ సోమవారం ఉదయం 9-03 గంటలకు శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖరభారతీస్వామి ఆధ్వర్యంలో జరగనున్న నేపథ్యంలో బుధవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. 4వ రోజు శనివారం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్‌కు నిర్వహించిన అభిషేకంలో ఈఓ తిమ్మానాయుడు, రిషిత దంపతులు, ప్రధాన దాతలు నలమలపు విజయభాస్కరరెడ్డి, శ్రీదేవి దంపతులు, కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి దంపతులు, గుంజి కృష్ణారావు, రమాదేవి దంపతులు, కాట్రగడ్డ అనిల్ కుమార్, శ్రీవిద్య దంపతులు, మేదరమెట్ల శంకరారెడ్డి కుటుంబసభ్యులు హజరయ్యారు. శనివారం గురువందనం, గణపతిపూజ, మండప పూజలు, మహన్యాస పారాయణం, రుద్ర పారాయణం, సూర్యనమస్కారములు, మంత్ర అనుష్టాన ములు, వేదపారాయణం, సపుందరకాండ పారాయణం, అష్టోత్తర శతకలశస్నపనం, నాగవల్లీ దళార్చన తదితర పూజలు నిర్వహించారు. దేవాలయం వద్ద ప్రదర్శించిన శ్రీరామాంజనేయం ప్రత్యేకనృత్య ప్రదర్శన, కూచిపూడి, భరతనాట్యం విశేషంగా ఆకట్టుకున్నాయి.

హాజరుకానున్న మంత్రులు

మహాకుంభాభిషేక కార్యక్రమాలు కార్యక్రమాలకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హజరుకానున్నారు. సోమవారం ఉదయం 5 గంటలకు అద్దంకి పట్టణం సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి శింగరకొండ వరకు సుమారు 1500 మంది మహిళలతో కలశయాత్ర నిర్వహించనున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ నుండి తీసుకు వచ్చిన ఏనుగు కలశ యాత్రలో ముందు భాగంలో నడవ నుంది. బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల తోపాటు ఉభయ తెలుగురాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హజరుకానున్నారు.



లక్ష్మీప్రసాద్‌కు రసీదు అందజేస్తున్న ఈవో

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి మండపం నిర్మాణానికి విరాళాలు వెల్లువల వస్తున్నా యి. శనివారం కామేపల్లి గ్రానైట్స్ అధినేత కామేపల్లి లక్ష్మీప్రసాద్, సామ్రాజ్యం దంపతులు రూ.2,01,116, అద్దంకి మండలం నాగులపాడుకు చెందిన అడుసుమల్లి వెంకటేశ్వర్లు (ఏఈఎస్), అరుణ దంపతులు రూ.1,00,359, తిమ్మాయపాలెంకు చెందిన అల్లంనేని పూర్ణచంద్రరావు, పద్మజ దంపతులు రూ.1,05,116, అద్దంకి పట్టణానికి చెందిన చిన్ని అంజిబాబు, శ్రీదేవి దంపతులు రూ.1,01,116లు, వేముల వల్లేశ్వరరావు, శ్రీదేవి దంపతులు రూ.1,01,116లు విరాళాలను ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. కొరిశపాడు మండలం రావినూతలకు చెందిన పుట్టా భాస్కరరావు, లక్ష్మి దంపతులు మారుతీభవన్‌లో ఒక గదిలో అవసరమైన ఏసీ, గీజర్, డబుల్‌కాట్, బెడ్‌లు ఏర్పాటుకు అవసరమైన నగదును ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. సందిరెడ్డి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్, సందిరెడ్డి రమేష్, కోనేటి కళ్యాణ్, నూతి ప్రసాద్ పాల్గొన్నారు.

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్ కు శనివారం లక్ష త మలపాకులతో పూజ నిర్వహించారు. మహాకుంభాభిషేకము పూజలలో బాగంగా శనివారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. చీరాల ఆర్‌డిఓ చంద్రశేఖరనాయుడు శింగరకొండ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

400 మందితో బందోబస్తు

శింగరకొండ లో మహాకుంభాభిషేకము, జీవధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సోమవారం 400 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. ఒక డీఎస్పీ, ఐదుగురు సీఐలు, 30 మంది ఎస్ఐలు బందోబస్తు పర్యవేక్షిస్తారన్నారు. అద్దంకి నుంచి శింగరకొండ వరకు సోమవారం ఉదయం కలశయాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో నామ్ రోడ్డులో ఆ సమయంలో ట్రాఫిక్‌ను మేదరమెట్ల వద్ద నిలిపి వేయనున్నారు. మహాకుంభాభిషేకానికి వచ్చే వాహనాలను శ్రీరామజీవన సంఘం సత్రం వరకు మాత్రమే అనుమతించనున్నారు. ఖాళీ స్థలాలలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

జానపద కళలను బతికించుకోవడం అందరి బాధ్యత



మాట్లాడుతున్న జానపద కళాపీఠం అధ్యక్షుడు దేవపాలన

అద్దంకిటౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): కనుమరుగు అవుతున్న జానపద కళలను బతికించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రోటరీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ వీ రవల్లి సుబ్బారావు(రుద్రయ్య) అన్నారు. అద్దంకి జానపద కళలకు పుట్టినిల్లు అన్నారు. శనివారం రాత్రి అద్దంకిలోని బంగ్లారోడ్డులో ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు స్మారక కళావేదికపై జానపద కళాపీఠం అద్దంకి రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ఉదయం చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో బౌద్ధం-జానపదం ఉపన్యాస వేదిక జానపద కళాపీఠం కార్యదర్శి జ్యోతి చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో బౌద్ధంలోని ఆర్థిక సాంఘీక రాజకీయ దృక్పదాలు, బౌద్ధం-సామాజిక చైతన్యం, జానపదాలు-జ్ఞానపదాలు అనే అంశాలపై వక్తలు ఉపన్యాసాలు చేశారు. సాయంత్రం ప్రజల పాటలు, కోలాటం, డప్పు విన్యాసాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అ కట్టుకున్నాయి. అనంతరం సాహిత్య, కళా పురస్కారాల సభలో డాక్టర్ కొండా శ్రీనివాసులుకు జ్యోతి శ్రీరాములు స్మారక సాహిత్య పురస్కారమును, కారుమూరి సీతారామయ్యకు వీ రవల్లి రంగయ్య, యశోదమ్మ స్మారక కళాపుస్కారాన్ని, బత్తుల అంజనేయులకు గుర్రం జాషువా స్మారక సాహితీ పురస్కారాలను జ్యోతి శ్రీనాధ్, శ్రీమన్నారాయణ, శ్రీరామమూర్తి, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), మారెడ్డి సుబ్బారెడ్డిలు ప్రదానం చేశారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు అ ర్వేటి సుబ్బారావును కళాపీఠం సభ్యులు ఆత్మీయ సత్కారం, ఇతర కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యు. దేవపాలన, కోశాధికారి శ్రావణ్‌కుమార్, చెన్నుపల్లి నాగేశ్వరరావు, రామాంజనేయులు, చప్పిడి వీ రయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశరక్షణకు జవాన్లు వీరోచిత పోరాటం



గ్రామంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు

పంగులూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో శనివారం ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాక్ ఉగ్రవాదులను మట్టుబెట్టిన సైనిక దళాలకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. 'భారత్ మాతాకి జై, దేశ ఐక్యత వర్ధిల్లాలి, జోహార్ మురళీనాయక్' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, ఎం.పి.డీ.ఓ. స్వరూపారాణి, గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, మాజీ జడ్.పి.టి.సి కె.వి.సుబ్బారావు, అడ్డగడ సుబ్బయ్య, మురకొండ సుబ్బారావు, సతీష్, కసుకర్తి సత్యనారాయణ, కార్యదర్శి కళ్యాణి, వి.ఆర్.ఓ. పరుశురామిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రేణంగివరంలో

మండలంలోని రేణంగివరం గ్రామంలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎల్.సునీత నేతృత్వంలో గ్రామస్థులు జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకీ జై అంటూ పుర వీదులలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ప్రదాన కూడలిలో జాతి ఐక్యతను చాటుతూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపాలెం (చీరాల) : పాక్ ఉగ్రవాదులపై వీరోచితంగా పోరాడి భారత సైనికులు దేశ రక్షణకు పాటుపడ్డారని పలువురు నాయకులు అన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంతేకాకుండా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ చేశారు. చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉల్లారెడ్డి, రాంబాబు, ఏడుకొండలు, కృష్ణారెడ్డి, పొదుపు సంఘాల మహిళలు, టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల





విశేష అలంకరణలో పోలేరమ్మ, శిడిమాను ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వాడరేవు (చీరాల), మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగాయి. 14వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పూజల్లో భక్తులు వేకువ నుండే అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీముద్రగిరి పావనము అమ్మవారి సముద్ర స్నానము, పూజ ఊరేగింపు, సద్ది నైవేద్యాలు, వడపప్పు, పానకాలు, శిడిమాను ఉత్సవాలు, పొంగళ్లు ఘనంగా నిర్వహించారు. అంతే కాకుండా రాత్రికి విజయవాడ వారిచే పాట కచ్చేరి, కోలాటం, సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొని పూజలు చేశారు.

నేడు పోలేరమ్మ పొంగళ్లు

మార్టూరు : మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ద్వారకపాడు గ్రామంలో ఆదివారం పోలేరమ్మ గుడి వద్ద భక్తులు పొంగళ్లు పెట్టనున్నారని కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి పోలేరమ్మ గుడి నుండి అమ్మవారిని భక్తులు ఊరేగింపు, కోలాహలం మధ్య గ్రామోత్సవం చేశారు. ఆదివారం ఉదయం పొంగళ్ల సాయంత్రం అన్నదానం నిర్వహించనున్నారు.

దొంగ అరెస్టు

● రూ.14.6లక్షల విలువ చేసే ట్రాక్టర్‌లు, రొటావేటర్ ట్రక్కులు స్వాధీనం

పుల్లలచెరువు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీలోని కొండారెడ్డి కొస్టాల్‌లో ట్రాక్టరు అపహరణ కేసును పోలీసులు ఛేదించారు. శనివారం పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌లో సీఐ ప్రభాకర్, ఎస్ఐ సంపత్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన పుల్లలచెరువు మండలం ఐటీవరం పంచాయతీలోని కొండారెడ్డి కొస్టాల్ షెడ్డులో ఉంచిన ట్రాక్టరు, రొటావేటర్‌ను దొంగలు అపహరించారు. బాధితులు శంకరరావు, వాగ్యానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని నిందితుడు పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం మృత్యుంజయపురం గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్ అలియాస్ మాస్‌గా గుర్తించారు. అతని కోసం గాలింపు చేపట్టారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గుట్లపల్లి వద్ద హుస్సేన్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితుడు తాను చేసిన దొంగతనాల వివరాలను చెప్పాడు. పుల్లలచెరువు మండలంలోని కొండారెడ్డి కొస్టాల్‌లో ట్రాక్టర్, రొటావేటర్, ఐటీవరం గ్రామ సమీపంలో ఉన్న ట్రాక్టరు ట్రక్కు, త్రిపురాంతకంలో నిలిపి ఉన్న మంచినీటి ట్యాంకర్, ముటుకులలో ఇటుకల బట్టీ వద్ద ట్రాక్టరు ట్రక్కును దొంగిలించాడు. చోరీకి గురైన వస్తువుల విలువ రూ.14.6లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

నిందితుడిని మార్కాపురం కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. అతి తక్కువ కాలంలో కేసును ఛేదించిన పుల్లలచెరువు పోలీసులను ఎస్పీ దామోదర్ అభినందించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పు భూములను పరిశీలించిన అధికారులు



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో

చినగంజాం, మే 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినగంజాం సర్వే నెంబరు 608 లోని ఉప్పు భూములను శనివారం అధికారులు పరిశీలించారు. జిల్లా రిజిస్ట్రార్ శైలజ, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి తూమాటి చంద్రశేఖర్ నాయుడు అధికారులతో కలిసి చినగంజాం ప్రాంతంలోని ఉప్పుభూములను, భూముల మ్యాప్‌ను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భూములను పరిశీలించి, భూములలో రైతులు ఉప్పు పండిస్తున్నారా..? లేదా..? సాగు చేయకుండా ఖాళీగా ఉంచారా, భూముల మార్కెటు విలువ ఎంత ఉంటుంది, ఇవి వ్యవసాయేత్ర భూములకు పనికొస్తాయా..? ఎన్ని ఎకరాలు సాగు చేస్తున్నారు తదితర విషయాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్.ఐ బండారు దానియేలు, మండల సర్వేయర్ జీవి.సుబ్బారావు, సచివాలయ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఉప్పు రైతులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ ఆత్మారావు

చినగంజాం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చినగంజాం గ్రామసర్పంచ్ రాయని ఆత్మారావు అన్నారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో చినగంజాం గ్రామ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పనుల నిమిత్తం గ్రామానికి వచ్చే పరిసర ప్రాంతాల ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామసర్పంచ్ సూచించారు. వేసవి కాలం ముగించే వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏ.ఈ పి.బసవరాణి, ఏపీవో జె.లక్ష్మీదేవి, గ్రామ కార్యదర్శి అంజయ్య, టీడీపీ నాయకులు బెల్లంకొండ రమేష్‌బాబు, ఎం.లక్ష్మయ్య, ఏసోబు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాతలు

చినగంజాం, మే.17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై పరీక్షలు నిర్వహించి, బహుమతులు అందజేసినట్లు గ్రంధపాలకులు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లీషు, కంప్యూటర్‌లో పెయింటింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు శనివారం పరీక్షలు నిర్వహించారు. పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు దాత, రాజుబంగారుపాలెం జడ్పీ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆర్ఎస్‌వీ.పోతురాజు బహుమతులు అందజేసినట్లు గ్రంథపాలకులు తెలిపారు. పరీక్షలలో పాల్గొన్న విద్యార్థులందరికీ జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఎస్.నరసింహారావు పెన్నులు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ వై.రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరు పోలీసుస్టేషన్‌కు గ్రానైట్ అసోసియేషన్ డ్రోన్ బహూకరణ

మార్టూరు, మే17 (ఆంధ్రజ్యోతి): మార్టూరు పోలీస్‌స్టేషన్‌కు మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ ఫేర్ అసోసియేషన్ వారు డ్రోన్ ను బహుకరించారు. సమాజంలో నేరాల నియంత్రణకు,శాంతి భద్రతల పర్యవేక్షణకు నిరంతరం పనిచేస్తున్న మార్టూరు స్టేషన్‌కు తమ వంతు బాధ్యతగా గ్రానైట్ అసోసియేషన్ వారు రూ.1.60 లక్షల విలువైన మావిక్ ఎయిర్ 3స్ డ్రోన్‌ను స్టేషన్ కు అందచేశారు. గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, తేలప్రోలు శ్రీనివాసరావులు డ్రోన్‌ను, డీఎస్పీ రామాంజనేయులు, సీఐ యం శేషగిరిరావు ల సమక్షంలో జిల్లా ఎస్పీ తుషార్‌డూడీకి అందచేశారు.

అవీ..ఇవీ..

మహిళలపట్ల అసభ్య ప్రవర్తన

● నిలదీసిన వ్యక్తిపై పలువురి దాడి
● ఘటనపై ఈపూరుపాలెంలో కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), మే 17 (ఆంధ్రజ్యోతి) : మహిళల పట్ల అసభ్య ప్రవరించడంతో పాటు అడ్డుకున్న భర్తపై ఆరుగురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం పాపాయిపాలేనికి చెందిన ఓ కుటుంబం రెండు రోజుల క్రితం రామాపురంలోని సముద్రతీరానికి వెళ్లింది. ఈ క్రమంలో స్నానాలు చేస్తుండగా అటుగా వెళ్తున్న ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఆ కుటుంబలోని మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో నిలదీసిన భర్తపై కూడా దాడిచేశారు. ఘటనపై ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మార్టూరు,మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన తాతా తిరుపతిరాయుడు (34) గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం వేకువజామున మృతిచెందారు. ఆ వివాహితుడైన ఆయన శుక్రవారం మధ్యాహ్నం ఇంటిలో గడ్డిమందు తాగడంతో ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుని తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పులి అంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహహింసపై కేసు నమోదు

మార్టూరు, మే17(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం తన భర్త ఆయన కుటుంబ సభ్యులు తనను శరీరికంగా మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని మార్టూరు గ్రామంలోని ముస్లింకాలనీలో నివాసం ఉంటున్న మునిపల్లి రిజ్వానా అనే వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ ఇచ్చిన ఫిర్యాదుమేరకు భర్త అత్తమామలు ఆడపడచులపై శుక్రవారం రాత్రి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా శనివారం తెలిపారు.

ఆటో బోల్తా- వ్యక్తికి గాయాలు


గాయపడ్డ చెన్నారెడ్డి

చినగంజాం, మే 17 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు తప్పి బోల్తా కొట్టడంతో వ్యక్తికి గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకొంది ఈ ఘటన చినగంజాం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్య ఉన్న సాయిబాబా మందిరం సమీపంలో చోటు చేసుకుంది. హైవే అంబులెన్స్ వారు తెలిసిన వివరాలు ప్రకారం ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన ఎదురు చెన్నారెడ్డి తన కారులో చీరాల నుండి ఒంగోలు వెళ్తున్నాడు. ఆయన మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడు. సాయిబాబా ఆలయ సమీపంలోనికి వచ్చేసరికి మద్యంమత్తులో ఉన్న చెన్నారెడ్డి కారును రోడ్డు పక్కకు నడుపుతుండగా అదుపు తప్పి 216వ నెంబరు జాతీయ రహదారి పక్కన ఉన్న పంట కాలువలోనికి వెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో చెన్నారెడ్డికి రక్తగాయాలయ్యాయి. ఆయన్ను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి నగదు ప్రోత్సాహం


దివ్యశ్రీకి నగదు ప్రోత్సాహం అందిస్తున్న పేర్నేటి శ్రీరామ్ ప్రసాద్

పందిళ్లపల్లి(చీరాల), మే 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని సజ్జా దివ్యశ్రీకు మచిలీపట్నంలోని ఓ కళాశాల వ్యవస్థాపకులు, కృష్ణాజిల్లా మానవతా సంస్థ అధ్యక్షులు పేర్నేటి శ్రీరామ్‌ప్రసాద్ రూ.25 వేలు నగదు ప్రోత్సాహం అందజేశారు. దేశాయిపేటకు చెందిన శ్రీరామ్‌పసాద్ శనివారం మచిలీపట్నంలో ఆయన కళాశాలలో దివ్యశ్రీకు ప్రోత్సాహకం అందించారు. దివ్యశ్రీ ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 596 మార్కులు సాధించింది. దీంతో దివ్యశ్రీకు ప్రోత్సాహకం అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధులకు మందుల పంపిణీ

మార్టూరు, మే17 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఆశ్రమంలో శనివారం మార్టూరు ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా వేసవి కాలంలో వృద్ధులు తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్యాధికారిణి అంజమ్మ తెలిపారు. అనంతరం 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంజమ్మతో పాటు, అసిస్టెంట్ శేష సాయి తనూజ, ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు తదితరులు పాల్గొన్నారు.

దయనీయ స్థితిలో బర్లీ పొగాకు రైతులు

● కొనేవారికోసం ఎదురు చూపులు ● ముఖం చాటేస్తున్న వ్యాపారులు ● నైరాశ్యంలో సాగుదారులు


మండెలు వేసిన పొగాకు రైతులు

పర్చూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. చేతికి వచ్చిన పంటను అమ్ముకోలేక వారు నానా అవస్థలు పడుతున్నారు. కొనేవారి కోసం ఎదురు చూపులు చూస్తున్నా ఫలితం ఉండడం లేదు. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది.

మరో వైపు అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చమని ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. దీంతో ఉన్న పొగాకును తులానికో ఫలానికో అమ్ముకొని అప్పులు తీర్చుకుందామన్నా, వ్యాపారులు ముఖం చాటేస్తున్నారని రైతులు వాపోతున్నారు. పొగాకు కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపి రాష్ట్రస్థాయిలో ఉన్నత అధికారులతోపాటు, కంపెనీ ప్రతినిధులతో రివ్యూలు నిర్వహించినా ఫలితం లేకపోవడం బర్లీ రైతులను మరింత కలవరానికి గురిచేస్తోంది. నిన్న మొన్నటి వరకు అరకొర ధరకు అడిగిన వ్యాపారులు ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. దీంతో అన్నదాతలు కన్నీరు పర్యంతరం అవుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పొగాకు రైతుల పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా బర్లీ పొగాకు మండెలే దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ఈఏడాది సాగుదారుల్లో అత్యధికం కౌలు రైతులే ఉండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే లక్షలు ఖర్చుచేసి అప్పులు చేసి మరీ సాగు చేసుకున్నామని పంట చేతికి అంది వచ్చి నెలలు గడుస్తున్నా కొనేనాధుడే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు, వ్యవసాయ ఖర్చులు కలుపుకొని ఎకరానికి రూ.1.50 లక్షల వరకు ఖర్చుఅయ్యిందని రైతులు వాపోతున్నారు. బాపట్ల జిల్లా పరిధిలో పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లోనే అత్యధికంగా బర్లీ పొగాకును రైతులు సాగుచేసుకున్నారు. వ్యాపా రులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు చేయాలన్న ఆలోచనతో మొఖం చాటువేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉంటే ఎండకు వానకు పొగాకు దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ధర ఆశాజ కంగా ఉండటంతో అధిక విస్తీర్ణంలో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి రైతులు పొగాకు సాగుచేశారు. ఇదే సమయంలో పొగాకు కంపెనీలు సైతం తమ ప్రతినిధులను రైతుల వద్దకు పంపించి కొనుగోలు హామీ ఇప్పించాయి. సాగైన పొగాకును తామే కొను గోలు చేస్తామని రైతులకు హామీ ఇప్పించాయి. ప్రస్తుతం సదరు కంపెనీలు ముఖం చాటేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేసే విధంగా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

పర్చూరులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలింపు


మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన స్థానికులు

పర్చూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు గుర్తుతెలియని మృతదేహం వెలుగుచూడడం సంచలనంగా మారింది. స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని పంచాయితీరాజ్ భవనం ప్రహరీగోడ వెంబడి ఇటీవల వర్షానికి చేరిన నీటిలో శనివారం మృతదేహం పడి ఉంది. గుర్తించిన వాహనదారులు ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై మాల్యాద్రి హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం పడిఉన్న తీరు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం నీటిలో నుండి మృతదేహాన్ని వెలికి తీయించి రెవెన్యూ సిబ్బంది సారధ్యంలో పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న యువకుని మృతదేహం ఇలా అనుమానాస్పదంగా పడిఉండటం చర్చనీయాంశంగా మారిం ది. మృతదేహం శరీరంపై కేవలం షాట్ మాత్రమే ధరించి ఉన్నారు. గుర్తు తెలియని మృతదేహం వెలుగు చూడడంతో పెద్ద ఎత్తున ప్రజలు ప్రాంగణా నికి తరలివచ్చారు. మృతదేహం ఎవరిది, ప్రమాదవ శాత్తు మృతి చెందాడా, మరి ఏఇతర కారణాల వల్ల మృతి చెందాడా అన్న విషయం పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. అయితే గుర్తు తెలియని వ్యక్తి కావటంతో మృతదేహాన్ని స్థానిక మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై తెలిపారు.

పేదలకు సాయం చేయడం ప్రతిఒక్కరి బాధ్యత


నిత్యావసరాలు అందజేస్తున్న అనిల్‌కుమార్

చీరాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : పూట గడవక అవస్థల్లో ఉన్న నిరుపేదలకు సాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పద్మ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ గంటా అనీల్ కుమార్ పేర్కొన్నారు. నెలవారీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక సాయకాలనీ, ఎన్‌టీఆర్ నగర్‌లోని యానాది కాలనీకు చెందిన 20 నిరుపేద కుటుంబాలకు రూ.10 వేల విలువైన నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ గత తొమ్మిదేళ్లుగా తన తల్లిదండ్రుల పేరు మీదగా నిస్వార్థంతో కులమతాలకు తావులేకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పలువురు నిరుపేద కుటుంబాల ప్రతినిధులు సాయం పొందారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

తిమ్మరాజుపాలెం(పర్చూరు), మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుడులు సాధించవచ్చని రైతుసంఘం అధ్యక్షులు గోరంట్ల రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ నిర్వహించారు. ప్రస్తుతం వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం అధింకంగా ఉందన్నారు. దీనివల్ల ఖర్చు పెరిగిపోవడంతోపాటు, భూములు నిస్సారంగా మారతాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించటం జరిగిందన్నారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించే విధంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్, వీఏఏ గిరిధర్, యూనిట్ ఇన్‌చార్జి దాసరి సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డుదారులకే ప్రభుత్వ పథకాలు

పంగులూరు, మే 17(ఆంధ్రజ్యోతి): పంటసాగు చేసే కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు దక్కాలంటే సీసీఆర్‌సీ కార్డులు కలిగి ఉండాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని పంగులూరు, చందలూరు గ్రామాలలో శనివారం కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. పంటరుణంతో పాటు అన్నదాత సుఖీభవ, యాంత్రీకరణ పరికరాలు, విత్తనాలు ఇతర ప్రయోజనాలకు కౌలుదారు కార్డు తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, ఆర్ఐ. శ్వేత, వీఆర్‌వోలు చింపారావు, పరవురామిరెడ్డి, వీవోఏలు అమృత, నవనీత, ప్రియ, పలువురు రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

● స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అధికారులు ● మొక్కల పెంపకం ఆవశ్యతపై ప్రజలకు అవగాహన


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు

చినగంజాం, మే 17(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, తిరంగా ర్యాలీని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావులు అన్నారు. గ్రామంలోని ప్రధాన రహదారులలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు త్రివర్ణ పతకాలను చేతపట్టి భారత్ మాతాకీ జై, అమరజీవి మురళీనాయక్, జయహో భారత్ అనే నినాదాలు చేస్తూ ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. తదనంతరం సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహిస్తూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏ.ఈ బసవరాణి, గ్రామ కార్యదర్శి అంజయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండల కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పై శనివారము అవగాహన కార్యక్రమం నిర్వహించారు పరిసరాలను పరిశుభ్రంగా ప్రతి ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ రవి సూచించారు. ఎంపీడీవో జ్యోతిర్మయి కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. మండల కార్యాలయ అధికారులు వైద్యసిబ్బంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు

పంగులూరు : వ్యాధులు దరి చేరకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య అన్నారు. పంగులూరు పీహెచ్‌సీలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ అనూరాధ, స్టాఫ్‌నర్స్ రాఘవమ్మ, ఎల్‌టీ. హరిచందన, పద్మావతి, రాజారెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో బాలమ్మ అన్నారు. శనివారం మండలంలోని జార్లపాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మే మాసం థీమ్‌గా బీట్ ద హిట్ కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీలో కార్యక్రమం నిర్వహించి ప్రజలకు మొక్కలు నాటడం వలన ఉపయోగాలు, ఎండ తీవ్రతను తట్టుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బత్తిన సింగయ్య, ఈవోఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాద్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంగులూరు : వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి వ్యక్తి మొక్కలు నాటి చెట్లను పెంచాలని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎండనుండి కాపాడుకుందాం అని నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. బీట్ ద హీట్ అంటూ గ్రామంలో మొక్కలునాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, సర్పంచ్ కృష్ణారావు, కేవీ.సుబ్బారావు, ఈవోఆర్‌డీ సుమంత్, వీఆర్ ఏఈ హనుమంతరావు, ఏపీఎం జ్యోతిప్రసాద్, కార్యదర్శి కల్యాణి, వీఆర్‌వో పరుశురామిరెడ్డి, మురకొండ సుబ్బారావు, పెంట్యాల వెంకటేశ్వర్లు, అడ్డగడ సుబ్బయ్య, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.





పంగులూరు, అద్దంకిలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర ర్యాలీలో ప్రజలు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మేదరమెట: గ్రామస్థులు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి రాధా మాధవి అన్నారు. శనివారం మేదరమెట్లలో స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు తడి, పొడి చెత్త వేరువేరుగా పంచాయతీ వాహనాలు వచ్చినప్పుడు అందులో వేయ్యాలన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా రోడ్డు పక్కన పెట్టిన చెత్త కుండిలలో వేస్తే పంచాయతీ సిబ్బంది వాటిని తొలగిస్తారన్నారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి మాట్లాడుతు పంచాయతీ సిబ్బంది బాధ్యతగా పని చేసి చెత్త నిల్వలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మన్నె దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల : వడగాలులు, ఎండతీవ్రత ప్రభావానికి గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బాబోయ్ వడగాలులు', పది మంది మృతి అంటూ కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో శనివారం మండల పరిధిలోని ఈపూరుపాలెంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపిడివో శివసుబ్రహ్మణ్యం పాల్గొని ఎండతీవ్రత కలుగు నష్టాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఆర్డీవో అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంలో భాగంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. డీఎల్‌పీవో శివన్నారాయణ, వివిధ శాఖల అధికారులు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అలాగే తోటవారిపాలెంలో పంచాయతి కార్యదర్శి భారతి ఆధ్వర్యంలో తిరంగా విజయోత్సవ ర్యాలీ జరిగింది .కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, నాదెండ్ల కోటేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మే 17 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయంలో నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చక్కని భరోసా అని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో 27 మందికి రాష్ట్రప్రభుత్వం నుంచి విడుదలైన రూ.28,03,459 లక్షలు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం సామాన్య ప్రజలకు వైద్యం సాయం అందించే ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, కూటమి నాయకులు కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చిన్నారుల విద్యావిధానంపై ప్రత్యేక దృష్టి

చీరాల : కూటమి ప్రభుత్వం విద్యా విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రోత్సహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఇటీవల పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన ఓట్ల హేమబిందు, మాచర్ల వెంకట హేమలత, అందె శ్వేత, కౌతవరపు ఉజ్వల, మర్రివాడ జ్యోష్ణప్రియలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున గాల నరేష్ కృషితో ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదు ప్రోత్సా హం అందజేశారు. క్రమ శిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని సూచించారు.